# క్రైమ్ THE మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
21-7-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 119

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# ధరణిపై దర్యాప్తు వెనుక?!

**రాజకీయ అస్త్రమేనా?**

**నిజమైన నిందితులను పట్టుకునే ఛాన్స్ ఉందా**

**తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో సంచలనం**



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ ప్రభుత్వం దూకుడు మీద ఉంది. దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటోంది. తెలంగాణ రాజకీయాల్లో అత్యంత సున్నితమైన, వివాదాస్పదమైన ధరణి పోర్టల్ భూ అక్రమాలపై రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. 2020 అక్టోబర్ 29న ధరణి ప్రారంభమైనప్పటి నుంచి 2026 జూలై వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీ పై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు ఒక ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇది నిజంగా సాహసవంతమైన నిర్ణయం. గత ప్రభుత్వ హయాంలో లక్షలాది ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి ఎలా వెళ్లాయి?

2లో



# వచ్చే ఎన్నికల్లో ఆ ఎమ్మెల్యేలకు సీట్లు కట్!

**పనిచేయని వారి స్థానంలో కొత్త నాయకులు**

**ప్రత్యామ్నాయ నాయకత్వం టిడిపిలో రెడీ**

**గట్టి హెచ్చరికలు పంపుతున్న అధినేత చంద్రబాబు**

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో :** వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ప్రయోగాలు చేయనున్నారా? కొత్త వారి టిక్కెట్లు ఇస్తారా? ప్రస్తుత సిటింగుల పనితీరు బాగాలేదా?

2లో



# గులాబీ పార్టీలో ఫోటో చిచ్చు!

**హరీష్ రావు పాదయాత్రలో కనిపించని కేటీఆర్ ఫోటో**

**పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయినా దక్కని ప్రోటోకాల్**

**ఉద్దేశపూర్వకంగానే అంటున్న పార్టీలో ఒక వర్గం**

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** గులాబీ పార్టీలో విభేదాలు ఉన్నాయా? కేటీఆర్ అధిపత్యాన్ని హరీష్ రావు జీర్ణించుకోలేకపోతున్నారా? అందుకే సొంతంగా ఎదగాలని భావిస్తున్నారా? అందుకే పాదయాత్రకు సిద్ధపడ్డారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గులాబీ పార్టీలో విభేదాలు అనేది పాత మాట కానీ.. తాజాగా హరీష్ రావు పాదయాత్రలో ఒక విషయం హాట్ టాపిక్ అవుతోంది.

3లో

# 'దూషణ' రాజకీయం!

**విధానపరమైన విమర్శల స్థానంలో తిట్ల దండకాలు**

**దిగజారుతున్న తెలంగాణ పాలిటిక్స్**




తెలంగాణలో రాజకీయం రూటు తప్పుతోంది. వ్యక్తిగత దూషణలకు ఇప్పుడు నాయకులు పెద్దపీట వేస్తున్నారు. రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శల స్థానాన్ని ఇప్పుడు పచ్చి బూతులు, వ్యక్తిగత దూషణలు ఆక్రమిస్తున్నాయి. శనివారం టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నిరుద్యోగుల సదస్సు జరిగింది. ఈ సమావేశంలో నిరుద్యోగుల సమస్యలను పక్కనపెట్టి.. సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా తీవ్రస్థాయిలో తిట్ల దండకం అందుకున్నారు గులాబీ పార్టీ నేతలు.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** అయితే దీనిపై సాయంత్రం స్పందించారు సీఎం రేవంత్ రెడ్డి. అదే స్థాయిలో విరుచుకుపడ్డారు. నువ్వెంత.. నీ జాతి ఎంత.. నీ జాతి మా ప్రజాపాలన మీద శాపనార్థాలు పెడతారా అంటూ సీఎం కౌంటర్ ఇచ్చారు. అయితే ఇక్కడ విమర్శలు అంటే విధానపరమైనవి కాదు. కేవలం బూతుపరంగా.. జుగుప్సాకరంగా కామెంట్స్ కొనసాగుతున్నాయి.

**అసహ్యం కలిగించేలా..**

రాజకీయాల్లో విధానపరమైన విమర్శలు అనేవి సహజం. కానీ తెలంగాణ సమాజంలో మాత్రం ఇప్పుడు తిట్లు వచ్చాయి ఆ స్థానంలో. పతాక స్థాయికి తిట్ల పురాణం చేరుతోంది. పౌర సమాజంతో పాటు సామాన్య ప్రజలకు సైతం తీవ్ర అసహ్యం కలిగిస్తోంది. నిరుద్యోగ సంగ్రామ సభ పెట్టిన కేటీఆర్ కొంతమంది యువతతో మాట్లాడించారు. వారు రేవంత్ రెడ్డి పై వ్యక్తిగత బూతులు తిట్టడానికి తమ సమయం కేటాయించారు. ఇందులో మహిళలు



# పోలీస్ శాఖలో కలకలం!

**త్రిపుర డిజిపి ఆత్మహత్య**

**సర్వీస్ రివాల్వర్ తో కాల్చుకొని బలవన్మరణం**

**ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి**



**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** దేశవ్యాప్తంగా రెండు ఘటనలు పోలీస్ శాఖలు తీవ్ర కలకలం రేపాయి. త్రిపుర రాష్ట్ర డిజిపి అనురాగ్ దన్కడ్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. హైదరాబాదులో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ రెండు ఘటనలు పోలీస్ శాఖలో తీవ్ర కలకలం రేపాయి.

# బిజెపిలో రాజాసింగ్ కాక!

**ఈటెల రాజేందర్, బండి సంజయ్ కలిస్తే పార్టీ గెలుస్తుందా**

**హై కమాండ్ తీరును తప్పు పట్టిన గోషామహల్ ఎమ్మెల్యే**

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో భారతీయ జనతా పార్టీ బలపడాలని చూస్తోంది. ఆ పార్టీ అగ్రనేతలు రాష్ట్ర నాయకుల మధ్య సయోధ్యకు ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా బండి సంజయ్, ఈటెల రాజేందర్ మధ్య హై కమాండ్ పెద్దలు



2లో




# బహుదూర్ గూడ భూముల రచ్చ!

**దశాబ్దాలుగా కొందరి చేతుల్లో ప్రభుత్వ భూమి**

**తమదేనంటున్న ఆక్రమణదారులు**

**ఎకరాకు రూ. 3 కోట్ల పరిహారం డిమాండ్**

**రంగంలోకి హైడ్రా**

# తమ్మినేని చుట్టూ ఉచ్చు!

**భూకబ్జా కేసులో మాజీ స్పీకర్ కుటుంబం**

**తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్**

**కేసు నమోదు చేసిన పోలీసులు**

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీ మాజీ స్పీకర్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తమ్మినేని సీతారాం చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఆయనతోపాటు కుటుంబ సభ్యులు ఓ భూ కబ్జా కేసులో



3లో

# ఆర్మూర్‌లో రచ్చ!

**ఛలో అంకాపూర్ తో కదం తొక్కిన కాంగ్రెస్**

**బిజెపి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఇంటి ముట్టడికి ప్రయత్నం**

**భారీగా పోలీసులు, చెక్ పోస్టులతో హై టెన్షన్ వాతావరణం**

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణాలో విచిత్ర రాజకీయ పరిస్థితులను నడుస్తున్నాయి. అక్కడ అధికార కాంగ్రెస్ వర్సెస్ ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి అన్నట్టు ఉంది పరిస్థితి. అయితే ఇప్పుడు





# బహదూర్ గూడ భూముల రచ్చ!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** తెలంగాణలో బహదూర్ గూడ భూములు పై ఇప్పుడు పెద్ద చర్చ నడుస్తోంది. హైదరాబాద్ శివారులోని శంషాబాద్ పరిధిలో ఈ భూములు ఉన్నాయి. అక్కడ ప్రభుత్వం బుల్లెట్ ట్రైన్ డిపోల నిర్మాణం కోసం భారీగా భూ సేకరణ చేపడుతోంది అంటూ విస్తృతంగా ప్రచారం నడుస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అక్కడ జరుగుతున్నది భూ సేకరణ కాదు. చాలా సంవత్సరాలుగా కబ్జా కోరల్లో ఉన్న ప్రభుత్వ భూములను హైడ్రా సంరక్షిస్తోంది. స్వాధీనం చేసుకొని కంచ వేస్తోంది. చెరువుల ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్లతో పాటు విలువైన ప్రభుత్వ స్థలాలను కాపాడే యాక్షన్ ప్లాన్ లో భాగంగానే.. హైడ్రా ఈ చర్యలకు దిగింది.

**మింగుడు పడని అంశం..**

దశాబ్దాల కాలంగా ఆ భూములను వినియోగించుకుంటున్నారు కొందరు ప్రైవేటు వ్యక్తులు. ఒకవైపు సాగు, మరోవైపు వ్యాపార అవసరాలకు వాడుకుంటున్నారు. ఇప్పుడు హైడ్రా రంగంలోకి దిగి ఆ భూములను స్వాధీనం చేసుకోవడం వారికి మింగుడు పడడం లేదు. తరతరాలుగా తాము అనుభవిస్తున్న భూములు తమ చేతులు దాటిపోతుండడంతో హైడ్రా సిబ్బందితో పాటు అధికారులపై దాడికి దిగినంత ప్రయత్నం చేస్తున్నారు. చట్టబద్ధంగా చూస్తే ఈ భూములపై ఆయా వ్యక్తులకు ఎలాంటి అధికారిక హక్కులు లేవు. ప్రభుత్వ పట్టాలు కానీ.. హక్కు పత్రాలు కానీ లేవని రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అవి ముమ్మాటికి ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన భూములే.

**పరిహారానికి డిమాండ్..**

గత కొంతకాలంగా తమ ఆధీనంలో ఉండడంతో ఆ భూములు తమవేనని చాలామంది భావిస్తున్నారు. అందుకే ఆ భూములు ఖాళీ చేయాలంటే ఎకరానికి మూడు కోట్లు భారీ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతిష్టాత్మక బుల్లెట్ ట్రైన్ డిపో ప్రాజెక్టును అక్కడే ఏర్పాటు చేయాలని భావిస్తున్న తెలంగాణ ప్రభుత్వం.. గతంలో వీరితో చాలా రకాలుగా చర్చలు జరిపింది. అయితే అవి తమ భూములు కావడంతోనే ప్రభుత్వం చర్చించింది అని వారు భావిస్తున్నారు. బేరసారాలకు దిగుతున్నారు. దీంతో ప్రభుత్వం సాఫ్ట్ కార్నర్ పక్కనపెట్టి హైడ్రా సాయంతో నేరుగా రంగంలోకి దిగింది. ఆ భూములను స్వాధీనం చేసుకుంటోంది.

**ధరల పెరుగుదలతో..**

ప్రస్తుతం శంషాబాద్ చుట్టూ భూముల ధరలు అమాంతం పెరిగాయి. రీజనల్ రింగ్ రోడ్, బుల్లెట్ ట్రైన్ కనెక్టివిటీ వంటి మౌలిక వసతుల ప్రాజెక్టుల వల్ల అక్కడ భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ క్రమంలో ప్రభుత్వ భూములు వదులుకునేందుకు ఆక్రమణదారులు సమ్మతించడం లేదు. అలాగని హక్కు పత్రాలు లేని ప్రభుత్వ భూములకు కోట్లాది రూపాయల పరిహారం ఇవ్వడం చట్టప్రకారం సాధ్యం కాదు కూడా. అందుకే అక్కడ హైడ్రా కఠిన చర్యలు ఆక్రమణదారులకు మింగుడు పడడం లేదు.

# 'దూషణ' రాజకీయం!

కూడా ఉన్నారు. ఒక ముఖ్యమంత్రిని ఉద్దేశపూర్వకంగా తిట్టించడం.. దానిని ఆస్వాదించడం మాత్రం సరికాదు.

**రేవంత్ వ్యూహాత్మకంగా..**

ప్రతిపక్షం చేసే విమర్శలను తనకు అనుకూలంగా మార్చుకుంటున్నారు సీఎం రేవంత్. తనను తిడుతున్న ప్రతి సందర్భాన్ని పరోక్షంగా ఒక సామాజిక అంశంగా మారుస్తున్నారు. తెలంగాణ సమాజంలో గత పాలకుల సామాజిక వర్గం పై సహజంగా ఉంటే కొన్ని వర్గాల వ్యతిరేకతను.. మరింత పెంచేందుకు వాడుకుంటున్నారు. తెలంగాణను పదేళ్లు దోచుకున్న ఒక నిర్దిష్ట జాతి శక్తులు, ఇప్పుడు పేద ప్రజా పాలనపై శాపనార్థాలు పెడుతున్నాయి అంటూ చేస్తున్న కామెంట్స్ ప్రజల్లోకి బలంగా వెళ్తున్నాయి. ఈ విషయంలో సీఎం రేవంత్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. అయితే విధానపరమైన విమర్శల స్థానంలో ఈ తిట్ల దండకం, దూషణలపర్వం ఎంత మాత్రం సహేతుకం కాదు అని తెలంగాణలో మేధావులు అభిప్రాయపడుతున్నారు.

# అయోధ్య విరాళాలపై సీనియర్ అధికారులతో దర్యాప్తు

## వ్యవహారాన్ని రాజకీయ కోణంలో చూడొద్దన్న సుప్రీం

న్యూఢిల్లీ: అయోధ్య రామమందిర నిధుల దుర్వినియోగం కేసుపై సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆలయ విరాళాలు దారిమళ్లాయనే ఆరోపణలకు సంబంధించి దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. ఈ కేసును స్థానిక పోలీసుల ద్వారా కాకుండా సీనియర్ అధికారులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం ద్వారా విచారణ జరిపే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా దర్యాప్తు పురోగతిపై స్టేటస్ రిపోర్టును ధర్మాసనానికి సమర్పించారు. ఈ కేసులో ఇప్పటివరకు 8 మందిని అరెస్ట్ చేసినట్లు కేంద్రం న్యాయస్థానానికి తెలిపింది. ఎస్ఐటీ ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు స్వీకరించి కోర్టుకు తెలియజేస్తామని ఎస్‌జే వెల్లడించారు. ఈ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారాన్ని రాజకీయ కోణంలో చూడవద్దని పిటిషనర్లను హెచ్చరించింది. కోర్టులు రాజకీయ వేదికలు కావన్న ధర్మాసనం.. ఈ ఆరోపణలపై నిష్పాక్షికంగా, సమగ్రంగా దర్యాప్తు జరగడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసింది. పిటిషనర్ల తరపు న్యాయవాదులు భక్తులు సమర్పించిన కానుకలు, విరాళాలకు సంబంధించిన అన్ని రికార్డులను భద్రపరచాలని కోర్టును కోరారు. అలాగే విరాళాలకు సంబంధించిన రసీదులను ప్రత్యేక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది.

# బిజెపిలో రాజాసింగ్ కాక!

(మొదటి పేజీ తరువాయి)

రాజీ ఫార్ములాను అమలు చేశారు. ఆ ఇద్దరు నేతలు ఐక్యం కావడంతో ఒక అడుగు ముందుకేసినట్లు భావిస్తున్నారు. అయితే సరిగ్గా ఇదే సమయంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈటెల రాజేందర్ తో పాటు బండి సంజయ్ లను లక్ష్యంగా చేసుకొని రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు కమలం పార్టీలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. కేవలం ఆ ఇద్దరు నేతలు రాజీ పడితే తెలంగాణలో బిజెపి అధికారంలోకి వచ్చేస్తుందా అంటూ ప్రశ్నించారు. నేతల మధ్య ఉండే వ్యక్తిగత ఈగోల వల్ల పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోందని.. ఆ విషయాన్ని హై కమాండ్ కు చెప్పానని కూడా రాజాసింగ్ వ్యాఖ్యానించడం గమనార్హం.

**వరుసగా మూడుసార్లు..**

రాజాసింగ్ గోషామహల్ నుంచి మూడుసార్లు బిజెపి ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో గెలిచి ప్రభంజనం సృష్టించారు. హిందుత్వ వాదాన్ని వినిపించడంలో ముందుంటారు రాజాసింగ్. గత ఏడాది బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి కోరుకున్నారు. కానీ పార్టీ హైకమాండ్ పరిగణలోకి తీసుకోలేదు. దానిని నిరసిస్తూ గత ఏడాది జూలైలో బిజెపికి రాజీనామా చేశారు. అయితే అప్పటికే రాజాసింగ్ వ్యాఖ్యలతో విసిగి వేసారి పోయిన బిజెపి హై కమాండ్ ఆయన రాజీనామాన్ని ఆమోదించింది. అయితే ఇటీవల మళ్ళీ బిజెపిలో క్రియాశీలకం అయ్యేందుకు.. పార్టీలోకి రీఎంట్రీ ఇచ్చేందుకు రాజాసింగ్ ప్రయత్నం చేస్తున్నారన్న కామెంట్స్ వినిపించాయి. కానీ ఇప్పుడు మరోసారి నోరు జారారు రాజాసింగ్. పార్టీలో సీనియర్లుగా ఉన్న ఈటెల రాజేందర్, బండి సంజయ్ లపై వ్యాఖ్యలు చేశారు.

**టిడిపి ద్వారా ఎంట్రీ..**

రాజాసింగ్ తెలుగుదేశం పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. 2009లో ఆ పార్టీ తరపున కార్పొరేటర్ గా పోటీ చేసి గెలిచారు. 2014లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి భారీ మెజారిటీతో గెలిచారు. అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో సైతం బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి రెండోసారి గెలిచారు. అయితే 2014లో ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఓవైసీ ని ప్రోటెం స్పీకర్ గా చేయడాన్ని వ్యతిరేకించారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసేందుకు కూడా బహిష్కరించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకున్నారు. గత ఏడాది తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్ష పదవికి నామినేషన్ వేసేందుకు సిద్ధపడ్డారు. అందుకు హైకమాండ్ అంగీకరించకపోవడంతో పార్టీకి రాజీనామా చేశారు. అప్పటినుంచి పార్టీకి దూరంగా ఉన్నారు. అయితే ఇప్పుడు పార్టీ హైకమాండ్ తెలంగాణలో పార్టీ బలోపేతానికి నడుం బిగించింది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే రాజాసింగ్ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఎప్పటికప్పుడు రాజాసింగ్ పై వేటు వేయడం.. సస్పెన్షన్ ఎత్తివేయడం పరిపాటిగా మారింది.

# పోలీస్ శాఖలో కలకలం!

త్రిపుర రాష్ట్ర రాజధాని అగర్తలా లోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో.. తన సర్వీస్ గన్ తో కాల్చుకుని బిజెపి అనురాగ్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. గన్ తో కాల్చుకోవడానికి పోలీస్ సిబ్బంది గుర్తించారు. వెంటనే అగర్తలాలోని జిబి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ప్రాణాలు పోయినట్లు నిర్ధారించారు.

**సీనియర్ ఐపీఎస్ అధికారి..**

ఓ రాష్ట్ర పోలీస్ బాస్ ఆత్మహత్యకు పాల్పడడంతో త్రిపుర ప్రభుత్వం ఉలిక్కిపడింది. ఈ ఘటనకు గల కారణాలను అన్వేషిస్తున్నారు. పోలీస్ సీనియర్ అధికారులతో పాటు ఇతర ఉన్నతాధికారులు ఆసుపత్రికి చేరుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 1994 బ్యాచ్ కు చెందిన ఐపీఎస్ అధికారి అనురాగ్. 2025లోనే డీజీపీగా బాధ్యతలు చేపట్టారు. ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

**హైదరాబాద్ పోలీస్ అకాడమీలో..**

మరోవైపు హైదరాబాదులోని జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తనను లైంగికంగా వేధిస్తున్నాడంటూ ఉదయ్ పై మహిళా ట్రైని ఐపీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పెద్ద ఎత్తున ఆయనపై విమర్శలు వచ్చాయి. తీవ్ర మనస్థాపానికి గురైన ఉదయ్ ఆత్మహత్యకు పాల్పడడంతో సహచరులు ఆసుపత్రిలో చేరారు. ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్ కానిస్టేబుల్ గా ఉద్యోగ ప్రస్థానం మొదలు పెట్టాడు. ఒక సీఐ చేసిన అవమానంతో అతను ఐపీఎస్ కావాలని పట్టుదల పట్టాడు. నాలుగు సార్లు ప్రయత్నించి చివరికి అనుకున్నది సాధించాడు. అయితే జాతీయ పోలీస్ అకాడమీలో మహిళా ట్రైన్ ఐపీఎస్ విషయంలో అనుచితంగా వ్యవహరించారని వార్తలు వచ్చాయి. పోలీసులకు ఫిర్యాదు వెళ్లడంతో స్పందించాడు. తనపై వచ్చిన ఫిర్యాదులు, ప్రచారాలు పూర్తిగా అవాస్తవం అని పేర్కొన్నాడు. న్యాయం తప్పక గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. అనంతరం ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. పోలీస్ శాఖకు సంబంధించి ఇద్దరు ఉన్నతాధికారులు ఇలా బలవన్మరణాలకు ప్రయత్నించడం ఆందోళన కలిగిస్తోంది.

# ధరణిపై దర్యాప్తు వెనుక?!

నిబంధనలకు విరుద్ధంగా డిజిటల్ రికార్డులను ఎవరు మార్చారు? అనే కోణంలో ఈ విచారణ జరగనుంది.

**విచారణకు స్వేచ్ఛ..**

అయితే ఈ విషయంలో భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. విచారణ శైలి వెనుక ఉన్న వ్యూహాలపై చర్చ నడుస్తోంది. ప్రభుత్వం అసలు ఉద్దేశం తప్పు చేసిన వాళ్లను జైలుకు పంపడమా? లేకుంటే పొలిటికల్ మైలేజ్ కోసం వారిని బ్లాక్ మెయిల్ చేసి దానికి తెచ్చుకోవడమా? అనేది అర్థం కావడం లేదు. ప్రభుత్వం నిజంగా ధరణి ద్వారా అన్యాయానికి గురైన రైతులకు న్యాయం చేయాలని.. భూములను కొల్లగొట్టిన పెద్దలను చట్టం ముందు నిలబెట్టాలని భావిస్తే కచ్చితంగా విచారణ బృందానికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి. అలా చేస్తేనే నిజమైన నిందితులు, తప్పు చేసిన వారికి శిక్షించే అవకాశం ఉంటుంది. ఇటీవల కేరళలో ఇలాంటి వ్యవహారాల్లో నిర్వహించిన ప్రాథమిక ఫోరెన్సిక్ ఆడిట్లో దాదాపు 22 వేల అనుమానాస్పద లావాదేవీలు వెలుగులోకి వచ్చాయి. అదే పరిస్థితి ఇక్కడ అమలు చేస్తే బాధితులకు న్యాయం జరిగే అవకాశం ఉంది.

**అప్పట్లో అనేక లోపాలు..**

అప్పట్లో ప్రభుత్వం చేతుల్లోనే ధరణి పోర్టల్ నడిచింది. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ వంటి సమస్యలు డిజైన్ చేశాయి. కానీ పోర్టల్ సిస్టం ఆర్కిటెక్చర్ లో కావాలని కొన్ని నుసుగులను వదిలేసారు అనే విమర్శ ఉంది. వాటిని ఆసరాగా చేసుకుని కొన్ని నిర్దిష్ట మాడ్యూల్స్ ద్వారా.. అనధికారికంగా భూముల రికార్డులను మార్చేశారని రెవెన్యూ శాఖ ఫోరెన్సిక్ ఆడిట్లో గుర్తించింది. ప్రధానంగా రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి, సిద్దిపేట, వికారాబాద్ జిల్లాలోని నిషేధిత జాబితాలో ఉన్న భూములను సైతం రాత్రికి రాత్రి అన్లాక్ చేసి ప్రైవేటు వ్యక్తుల పేర్ల పైకి మార్చడం వెనుక పెద్ద నెట్వర్క్ పనిచేసింది అన్న ఆరోపణలు ఉన్నాయి. పెద్దవ్యవస్థీకృత నేరం జరిగినప్పుడు నిపుణుల కమిటీలు కేవలం లోపాలను మాత్రమే ఎత్తి చూపగలవు. వాటిని శిక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది. మరి ఈ విషయంలో రేవంత్ సర్కార్ ఎంతవరకు నిలబడుతుందో చూడాలి.

# పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం

## నీట్, అయోధ్య విరాళాలపై చర్చకు విపక్షాల పట్టు

## తొలిరోజే గందరగోళ పరిస్థితులు మధ్య వాయిదాల పర్వం



న్యూఢిల్లీ,జులై: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. తొలిరోజే ఉభయసభల్లో గందరగోళం ఏర్పడింది. విపక్ష సభ్యులు పలుమార్లు స్పీకర్ పోడియం వద్దకు చేరి నిరసన తెలిపారు. దీంతో వారిని స్పీకర్ ఓంబిర్లా వారించారు. అయితే ఉభయసభలు మధ్యాహ్నం 12 గంటలకు వరకు వాయిదా పడ్డాయి. వివిధ అంశాలపై విపక్షాలు లోక్‌సభలో ఆందోళన చేశాయి. నీట్ పేపర్ లీకేజీ, అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ అంశాలపై విపక్ష సభ్యులు నినాదాలు చేశాయి. ప్రశ్నోత్తరాల సమయాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి. కానీ విపక్ష సభ్యులు మాత్రం తమ నినాదాలను ఆపలేదు. దీంతో స్పీకర్ ఓం బిర్లా అసహనానికి గురయ్యారు. సభలో మొదటి రోజే ఇలా సాగితే అది చెడు సంప్రదాయాన్ని సూచిస్తుందని అన్నారు. ఆయన సభను 12 గంటల వరకు వాయిదా వేశారు. ఇక రాజ్యసభలోనూ ఇదే తరహా సీన్ రిపీటైంది. నీట్ పేపర్ లీకేజీ ఘటనపై విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడారు. నీట్ ఎగ్జామ్ స్కాండిల్‌పై మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారని, విద్యార్థులు నీట్ పరీక్ష పట్ల ఆందోళనకరంగా ఉన్నారని, లక్షలాది మంది పిల్లల భవిష్యత్తు గురించి తాను మాట్లాడబోతున్నట్లు చెప్పారు. నీట్ పరీక్ష లీకేజీ నేపథ్యంలో వేలాది మంది విద్యార్థులు జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్నారని, కానీ ఆ విద్యార్థులపై ప్రభుత్వం లాఠీఛార్జ్ చేస్తోందని ఆయన ఆరోపించారు. విద్యార్థులు స్వరాన్ని అణిచివేసేందుకు ప్రభుత్వం బలగాలను ఉపయోగిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థుల్ని చెదరగొట్టేందుకు లాఠీఛార్జ్‌కు తెగించారని ఖర్గే ఆరోపించారు. ఈ క్రమంలో రాజ్యసభ కూడా వాయిదా పడింది. తిరిగి ప్రారంభం అయినా అదే పరిస్థితి నెలకొనడంతో మధ్యాహ్నం 2.30 గంల వరకు ఉభయసభలు వాయిదా పడ్డాయి.

# వచ్చే ఎన్నికల్లో ఆ ఎమ్మెల్యేలకు సీట్లు కట్!



అటువంటి వారి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారా? ప్రతి నెల సర్వేలు చేపడుతు న్నారా? అంటే అవునని సమాధానం వినిపిస్తోంది. ఇటీవల జరిగిన ఎంపీల సమావేశంలో సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. పనితీరు మెరుగు పరుచుకోండి.. లేకుంటే మాత్రం మార్చేస్తాను అని హెచ్చరించారు. తనకు సమాచారం ఉందని.. పనిచేయని నేతలను ప్రోత్సహించే ఛాన్స్ లేదని.. ప్రత్యామ్నాయ నాయకత్వం సిద్ధంగా ఉంది అంటూ అధినేత చేసిన కామెంట్స్ ఇప్పుడు నాయకుల్లో ప్రకంపనలు రేపుతోంది..

**ఎమ్మెల్యేల పనితీరుపై ఆరోపణలు..**

మొన్నటి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించింది. బిజెపి, జనసేనతో కలిపి ఏకపక్ష విజయాన్ని దక్కించుకుంది. తెలుగుదేశం పార్టీ ఒంటరిగా 135 అసెంబ్లీ స్థానాలు, 16 లోక్సభ సీట్లను గెలుచుకుంది.. గతంలో టిడిపి గెలవని నియోజకవర్గాల్లో సైతం ఆ పార్టీ విజయం సాధించింది. ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించాలని.. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా వ్యవహరించాలని చంద్రబాబు పలుమార్లు పార్టీ ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలకు సూచించారు. అయినా సరే చాలామంది వైఖరిలో మార్పు రాలేదు. అందుకే చంద్రబాబు సీరియస్ గా ఉన్నట్లు తెలుస్తోంది.

**ఎప్పటికప్పుడు సర్వేల ద్వారా..**

కొంతమంది ఎమ్మెల్యేలతో పాటు ఎంపీల వైఖరి పార్టీకి నష్టం తెస్తోంది. మద్యం, ఇసుక మాఫియాలో చాలామంది ఎమ్మెల్యేలకు హస్తముంది. నియోజకవర్గాలతో పాటు సర్వేల్లో కూడా ఇది తెలుస్తోంది. చాలామంది ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇప్పటికే ప్రజాదారణ కోల్పోయారు. అటువంటి వారి వివరాలు అధినేత చంద్రబాబు వద్ద ఉన్నాయి. మరోవైపు ఎక్కడైతే ఎమ్మెల్యేలు పై ఆరోపణలు ఉన్నాయో.. అటువంటి చోట మొన్ననే పార్టీ కార్యవర్గాల్లో ప్రత్యామ్నాయ నాయకులకు చోటు కల్పించారు. వచ్చే ఎన్నికల్లో ఆ ఎమ్మెల్యేలు, ఎంపీల స్థానంలో నిలబెట్టేందుకు నాయకులను సిద్ధంగా ఉంచినట్లు తెలుస్తోంది. చాలామంది సొంత వ్యాపారాలు చేసుకుని.. క్యాడర్ తో పాటు ప్రజలను పట్టించుకోవడం లేదన్న విమర్శ ఉంది. అటువంటి వారి విషయంలో కూడా చంద్రబాబు సీరియస్ గా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో మార్పు కోసం ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని సిద్ధంగా ఉంచారు. అయితే ఇప్పటివరకు కేవలం హెచ్చరికలు జారీ చేశారు. ఇకనుంచి వేగంగా చర్యలకు దిగనున్నట్లు తెలుస్తోంది.

# గులాబీ పార్టీలో ఫోటో చిచ్చు!



భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆర్ ఫోటో ఎక్కడా కనిపించకపోవడం విభేదాలు పతాక స్థాయికి చేరినట్లు ప్రచారం నడుస్తోంది.

కెసిఆర్ చిన్న ఫోటోతో.. కాలేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోసి.. మిగతా ప్రాజెక్టులు నింపాలని డిమాండ్ చేస్తూ అన్నపూర్ణ సాగర్ నుంచి రంగనాయక సాగర్ వరకు మాజీ మంత్రి హరీష్ రావు పాదయాత్ర చేశారు. ఈ పాదయాత్రకు సంబంధించి భారీగా ఏర్పాటు జరిగాయి. భారీ ఫ్లెక్సీలు, బ్యానర్లు, జండాలతో హరీష్ పాదయాత్ర సాగింది. కానీ వాటిలో ఎక్కడా కేటీఆర్ ఫోటో లేదు. భారీ సైజులో హరీష్ రావు, చిన్న సైజులో కేసీఆర్ ఫోటోతో మాత్రమే అవి కనిపించాయి. పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆర్ ఫోటో వేయడం కనీసం ప్రోటోకాల్. కానీ ఫోటో లేకుండా కావాలనే చేశారనేది పార్టీలో ఒక వర్గం అభిప్రాయం.

**ముందుగా పాదయాత్ర..**

రాష్ట్రవ్యాప్తంగా సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధపడుతున్నారు కేటీఆర్. అందుకు సంబంధించిన గ్రౌండ్ వర్క్ కూడా ప్రిపేర్ అవుతోంది. ఈమధ్య సంగారెడ్డి జిల్లా రైతాంగానికి అండగా ఉండేందుకు సంగమేశ్వర టు బసవేశ్వర ప్రాజెక్టు కోసం పాదయాత్ర చేస్తానని హరీష్ రావు ప్రకటించారు. ఇప్పుడు సిద్దిపేట జిల్లాలో ప్రాజెక్టుల వద్ద పాదయాత్ర చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పార్టీ జెండాలో కేటీఆర్ ఫోటో లేకుండా చేశారన్న విమర్శ ఉంది. పార్టీలో హరీష్ రావు వర్సెస్ కేటీఆర్ అన్నట్టు పరిస్థితి మారింది. బయటకు అంతా బాగానే కనిపిస్తున్న.. లోలోపల విభేదాలు మాత్రం ఉన్నట్లు అర్థం అవుతుంది.

**తగ్గిన ప్రాధాన్యత..**

పార్టీలో కేటీఆర్ కంటే హరీష్ రావు సీనియర్. ఉద్యమ సమయంలో కేసీఆర్ కు అండగా నిలబడ్డారు హరీష్ రావు. కానీ కేటీఆర్ ఎంట్రీ తో హరీష్ రావు ప్రాధాన్యత పార్టీలో తగ్గినట్లు విమర్శలు వచ్చాయి. ఆ పార్టీలో విభేదాలు పతాక స్థాయికి చేరినట్లు కూడా ఆ మధ్యన ప్రచారం జరిగింది. భారతీయ జనతా పార్టీ హరీష్ రావు ద్వారా గులాబీ పార్టీని చీల్చుతుందని టాక్ నడిచింది. కానీ అటువంటిదేమీ లేదు. అయితే పార్టీలో తన బలం తగ్గకుండా ఉండేందుకు హరీష్ రావు ఎప్పటికప్పుడు బలప్రదర్శనకు దిగుతున్నారు అన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. తాజాగా పాదయాత్రలో తన ప్రాధాన్య తగ్గకూడదని కేటీఆర్ ఫోటోను హరీష్ రావు పక్కన పెట్టించారు అని ఆరోపణ వస్తోంది. గులాబీ పార్టీ శ్రేణులు కేటీఆర్ తో పాటు హరీష్ రావును కృష్ణార్జునులతో పోల్చుతారు. కానీ ఆధిపత్య పోరు మాత్రం కొనసాగుతోంది. హరీష్ రావు వైఖరి నచ్చక కవిత పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయారు అన్న విమర్శ ఉంది. ఇప్పుడు కేటీఆర్ ఫోటో లేకుండా చేయడం వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. ముందు ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయో నన్న ఆందోళన గులాబీ పార్టీలో ఉంది.

# తమ్మినేని చుట్టూ ఉచ్చు!

నిందితులుగా మారారు. ఐదు కోట్ల రూపాయల విలువైన భూమిని కొట్టేయాలని చూసి అడ్డంగా బుక్కయ్యారు. అసలు యజమాని బతికి ఉండగా.. ఆయన చనిపోయారని నకిలీ పత్రాలు సృష్టించి భూమిని కొల్లగొట్టారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న పోలీసుల దర్యాప్తులో ఈ విషయం తేలింది. దీంతో తమ్మినేని సీతారాం తో పాటు ఆయన భార్య, కుమారుడిపై కేసు నమోదయింది. ఈ క్షణమైనా అరెస్టు చేసే అవకాశం ఉండడంతో ఫ్యామిలీతో సహా పరారీలో ఉన్నారు.

**యజమాని చనిపోయారని చూపించి..**

శ్రీకాకుళం బలగ పరిధిలోని సర్వే నెంబర్ 35 /13 లో నాలుగు కోట్ల రూపాయల విలువైన భూమి కబ్జాకు కొందరు ప్రయత్నించారు. ఈ భూమికి సంబంధించి అంతవరకు గోవిందరాజులు అనే వ్యక్తి బతికి ఉండగానే చనిపోయినట్లు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించారు. ఒడిస్సా లోని జయపురం కు చెందిన అడబాల రజినీని గోవిందరాజులు కుమార్తె అందవరపు రజినీగా చూపించి.. తమ్మినేని సీతారాం కుమారుడు చిరంజీవి వెంకట్ నాగ్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ స్థలానికి ప్రహరీ నిర్మించే ప్రయత్నాన్ని అసలు యజమాని కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభం అయింది. నకిలీ పత్రాలు, తప్పుడు వారసత్వం సృష్టించడం, తప్పుడు రిజిస్ట్రేషన్ తదితర అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వ్యవహారం వెనుక తమ్మినేని సీతారాం, ఆయన భార్య వాణి ఉన్నట్లు కూడా పోలీసులు గుర్తించారు..

**వారంతా అరెస్ట్..**

ఈ కేసులో నిందితులుగా ఉన్న అడబాల రజిని, తెలుగు సతీష్ కుమార్, సలిపిల్లి లక్ష్మణరావు, మూడట్ల ఉపేంద్ర కుమార్, జేగురిపాటి ఉపేంద్ర రావు, మామిడి గోపాలకృష్ణ, సంపాన సాంబశివరావు, కోనా పెద్దిరాజును అరెస్టు చేశారు పోలీసులు. ఇతర నిందితులుగా ఉన్న త్రినాథ్, తమ్మినేని చిరంజీవి నాగ్, తమ్మినేని సీతారాం, తమ్మినేని వాణి లపై విచారణ కొనసాగుతోంది. వారిని సైతం అరెస్టు చేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. మరోవైపు తప్పుడు ధృవీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్కు సహకరించిన సబ్ రిజిస్టర్ బొడ్డేపల్లి అరుణను విచారించేందుకు ప్రభుత్వ అనుమతి కోరారు శ్రీకాకుళం జిల్లా పోలీసులు.

## పరారీలో ఫ్యామిలీ..

తమ్మినేని సీతారాం కుటుంబాన్ని ఏ క్షణంలోనైనా అరెస్టు చేసే అవకాశం ఉంది. ఈ విషయం తెలుసుకున్న తమ్మినేని సీతారాం ఫ్యామిలీతో సహా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. కోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసుకున్నట్లు తెలుస్తోంది. మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయారు తమ్మినేని. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి తమ్మినేని సీతారాంకు నియోజకవర్గ బాధ్యతలు నుంచి తప్పించారు. శ్రీకాకుళం పార్లమెంటు బాధ్యతలు అప్పగించారు. అయిష్టంగానే వైసీపీలో ఆయన కొనసాగుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆమదాలవలస నుంచి తన కుమారుడు ను బరిలో దించాలని భావిస్తున్నారు. ఇంతలోనే ఈ కేసు వెంటాడింది. చూడాలి చివరకు ఏం జరుగుతుందో.

# ఆర్మూర్‌లో రచ్చ!

తాము తక్కువ కాదు అన్నట్టు బిజెపి దూకుడు పెంచింది. ప్రధానంగా ఆర్మూర్ బిజెపి ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీ రగిలిపోతోంది. ఆయన స్వగ్రామం అంకాపూర్ కాగా.. ఛలో అంకాపూర్ కార్యక్రమానికి పిలుపునిచ్చింది కాంగ్రెస్ పార్టీ. బిజెపి ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు ప్రయత్నం చేసింది. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

**వివాదాస్పద వ్యాఖ్యలతో.**

వివాదాస్పద వ్యాఖ్యలకు పెట్టింది పేరు ఆర్మూరు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి. ఆయన ఇటీవల చేసిన ఒక వ్యాఖ్య అత్యంత వివాదాస్పదంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచితంగా స్కూటీలు ఇవ్వడం లేదని విమర్శించే క్రమంలో.. ఆయన ఏకంగా కాంగ్రెస్ నేతల షోరూంల పై పడి స్కూటీలను ఎత్తుకెళ్లాలని ప్రజలకు పిలుపునిచ్చారు. చట్టసభ సభ్యుడిగా ఉండి ఇలాంటి రెచ్చగొట్టే, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునేలా మాట్లాడడం పొలిటికల్ సర్కిల్స్లో తీవ్ర దుమారం రేపింది. దీనిని అస్త్రంగా మార్చుకొని కాంగ్రెస్ పార్టీ రాకేష్ రెడ్డి ఇంటి ముట్టడికి చలో అంకాపూర్ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. రాకేష్ రెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలిరావడంతో అంకాపూర్ లో ఎటు చూసినా పోలీసుల మోహరింపు, చెక్ పోస్టులతో హై టెన్షన్ నెలకొంది.

**నాయకుల గృహనిర్బంధం..**


ఈ ఘటనతో పోలీసులు ముందస్తుగా జాగ్రత్త పడ్డారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తో పాటు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ వినయ్ రెడ్డిలను ముందస్తుగా గృహనిర్బంధం చేశారు. ఉద్రిక్తతలను మరింత రగిలించేలా ఇరుపక్షాల నేతలు పోతా పోటీ సవాళ్లు విసరడంతో ఆర్మూర్లో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. అయితే కాంగ్రెస్ పార్టీ ఎదురుదాడికి సిద్ధమయింది. బిజెపి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ కౌంటర్ అటాక్ ప్రారంభించింది. రాకేష్ రెడ్డి ఇచ్చిన రూపాయి కే కార్పొరేట్ వైద్యం, సొంత డబ్బులతో పేదలకు ఎల్ల నిర్మాణం వంటి భారీ హామీలను హైలెట్ చేస్తోంది. మీ సొంత డబ్బులతో కట్టిస్తామన్న ఇళ్ల ముచ్చట ఏమైందో చెప్పాలంటూ కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్ చేశాయి. మరోవైపు బిజెపి కూడా పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నివాసాన్ని ముట్టడిస్తామంటూ హెచ్చరించాయి. దీంతో పరిస్థితి మరింత వేడెక్కింది. అయితే ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి వెనక్కి తగ్గలేదు. చలో అంకాపూర్ కార్యక్రమం తనకు భయాన్ని కలిగించలేదని.. మరింత ధైర్యం ఇచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం హామీ ఇచ్చి ఆపేసిందని.. కాంగ్రెస్ నాయకుల మెడల్లో బంగారాన్ని లాక్కెల్లాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# బాన్సువాడలో మళ్లీ గులాబీ జెండా ఎగరాలి

**పోచారం శ్రీనివాస్ రెడ్డికి గట్టిగా బుద్ది చెప్పాలి**

**ఏ పార్టీలో ఉన్నాడో కూడా తెలియని స్థితిలో పోచారం**

**పార్టీలో చేరిన బాన్సువాడ నేతలకు కెటిఆర్ ఆహ్వానం**



హైదరాబాద్: బాన్సువాడలో కుడితిలో పడిన ఎలుకలా పోచారం పరిస్థితి తయారైంది. ఇకపై ఏ ఎన్నికలు వచ్చినా ఆయన ఓడిపోవడం ఖాయం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎలక్షన్స్ ఎప్పుడు వచ్చినా బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఓడగొట్టడమే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కేటీఆర్ సమక్షంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన మోరీల్ శ్రీనివాస్ రావు, పలువురు నాయకులు తెలంగాణ భవన్లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ. గతంలో బాన్సువాడలో గులాబీ జెండాను ఎగురవేశాం. పెద్దాయన పోచారంను గెలిపిస్తే పోయి పోయి మునిగిపోయే పడవ కాంగ్రెస్ పార్టీలో చేరిండని ఎద్దేవా చేశారు. ఆయన కాంగ్రెస్‌లో చేరి కుడిదిలో పడ్డ ఎలుకలా గిలగిలా కొట్టుకుంటున్నడు. ఈ సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బాన్సువాడలో మరోసారి గులాబీ జెండా ఎగరేసే సమయం వచ్చిందని ఆయన అన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ తరపున గెలిచి పార్టీ మారారని, ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి కూడా బాగోలేదని ఆయనకు అర్థమైందన్నారు. ఈ గొంతులో ప్రాణం ఉన్నంత వరకు పార్టీ మారనని చెప్పిన పోచారం చివరకు మాట తప్పి పార్టీ మారారని ఆరోపించారు. స్పీకర్‌గా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు తాను ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకునే పరిస్థితి కూడా లేదని ఎద్దేవా చేశారు. పోచారం తన రాజకీయ భవిష్యత్తును తానే సమాధి చేసుకున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డిపై కూడా కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా చేతులెత్తేశారని ఆరోపించారు. దేవుళ్లపై ఒట్టు పెట్టి కూడా అబద్దాలు చెబుతున్నారని విమర్శించారు. ఏ సభ పెట్టినా కేసీఆర్‌ను విమర్శించడమే సీఎం పనిగా మారిందన్నారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ అన్నారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, షాపుల్లో ఎరువుల సంచులు లేకపోతే యాప్‌లో కనిపించినా ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఢిల్లీకి పంపేందుకు సంచులు ఉంటున్నాయని, కానీ రైతులకు మాత్రం అందడం లేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కూడా కేటీఆర్ స్పందించారు. రెండు పిల్లర్లు కుంగి 31 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు మరమ్మతులు ఎందుకు చేపట్టలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కన్నెపల్లి నుంచి ప్రతిరోజూ నీరు కిందకు వెళ్తున్నా పంపింగ్ చేయడం లేదన్నారు. రిజర్వాయర్లు డెడ్ స్టోరేజ్‌కు వెళ్తే ప్రభుత్వం మాత్రం 'కోల్డ్ స్టోరేజ్'లోకి వెళ్లిపోయిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ కోసం అవసరమైతే రక్తమే

# మేడిగడ్డ మరమ్మతులకు రంగం సిద్ధం...

- చివరి దశకు చేరుకున్న పరీక్షలు
- నిపుణుల నివేదికల ఆధారంగా పునరుద్ధరణ పనులు
- భద్రతా అనుమతుల తర్వాతే బ్యారేజీల నిర్వహణ
- శాస్త్రీయ విధానంతో కాళేశ్వరం బ్యారేజీల పునరుజ్జీవనం
- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. బ్యారేజీలపై నిర్వహిస్తున్న సమగ్ర శాస్త్రీయ పరీక్షలు చివరి దశకు చేరుకున్నాయని, వాటి ఆధారంగా మరమ్మతులు, పునరుద్ధరణకు అవసరమైన డిజైన్ల రూపకల్పన జరుగుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, బ్యారేజీల పునరుద్ధరణలో ప్రభుత్వం పూర్తిగా శాస్త్రీయ విధానాన్నే అనుసరిస్తోందని స్పష్టం చేశారు. నిపుణులు భద్రతపై పూర్తి స్థాయిలో ధ్రువీకరించే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకురాబోమని వెల్లడించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ , నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వంటి దేశంలోని అత్యున్నత సాంకేతిక సంస్థలు నేల స్వభావం, పునాదులు, కాంక్రీట్ నిర్మాణం, ఇతర నిర్మాణ భాగాలపై విస్తృత స్థాయిలో పరీక్షలు నిర్వహించాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఆ పరీక్షలు దాదాపు పూర్తయ్యాయని, వాటి ఫలితాలను ఐఐటీ బొంబాయికి పంపించగా, అక్కడ నిపుణులు సమగ్ర పునరుద్ధరణ డిజైన్లను సిద్ధం చేస్తున్నారని చెప్పారు. ప్రాథమిక అంచనాల ప్రకారం డయాఫ్రం వాల్ నిర్మాణం పునరుద్ధరణలో భాగం కావచ్చని భావిస్తున్నప్పటికీ, అన్ని సాంకేతిక నివేదికలను పరిశీలించిన అనంతరమే తుది మరమ్మతుల విధానాన్ని నిర్ణయిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# నగరంలో ముగ్గురు మైనర్ బాలికల అదృశ్యం

**తల్లిదండ్రుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు**

హైదరాబాద్: హైదరాబాద్‌లో ముగ్గురు మైనర్ బాలికలు ఒకేసారి అదృశ్యం కావడం కలకలం రేపుతోంది. దోమలగూడ ప్రాంతానికి చెందిన ముగ్గురు బాలికలు ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోవడంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వలస కార్మిక కుటుంబాలు దోమలగూడలోని ఫరీద్ బస్తీలో నివాసం ఉంటున్నాయి. అదే ప్రాంతానికి చెందిన సహిత కుమారి, స్నేహ కుమారి, లత అనే ముగ్గురు మైనర్ బాలికలు ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వారి తల్లిదండ్రులు దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి బాలికలు వెళ్లిన మార్గాల్లోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. విచారణలో బాలికలు మొదట హిమాయత్‌నగర్‌లో ఓ ఆటో ఎక్కినట్లు గుర్తించారు. ఆ తర్వాత వారు కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నట్లు సీసీటీవీ ఫుటేజీలో నమోదైంది. దర్యాప్తులో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి బాలికలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం రెండు రైల్వే స్టేషన్లలోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ వారి కదలికలను ట్రాక్ చేస్తున్నారు. బాలికలు తమ స్వగ్రామమైన ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లి ఉండొచ్చనే అనుమానంతో పోలీసులు ఆ దిశగా కూడా విచారణ చేపట్టారు.




## సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య 37కు పెంపు

### లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి అర్జున్ రామ్‌పాల్

న్యూఢిల్లీ,జులై:సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను మరోసారి పెంచేందుకు కేంద్రం సిద్ధమైంది. దీనికోసం రూపొందించిన బిల్లును కేంద్రం లోక్‌సభలో సోమవారం ప్రవేశపెట్టింది. సుప్రీంకోర్టు (నంబర్ ఆఫ్ జడ్జెస్) అమెండ్‌మెంట్ బిల్, 2026ను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్‌పాల్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దీనిప్రకారం ఇప్పటికే ఉన్న సుప్రీంకోర్టు యాక్ట్, 1956ను మార్చనున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలి రోజే కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టడం విశేషం. ప్రస్తుతం సుప్రీంకోర్టులో 33 మంది జడ్జీలున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్య 37కు పెరుగుతుంది. ప్రస్తుతం పార్లమెంట్‌లో నీట్ యూజీ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ప్రతిపక్షాల ఆందోళన మధ్యే ప్రభుత్వం ఈ బిల్లును కేంద్రం సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు కొత్తదేం కాదు. దీనిపై కేంద్రం గతంలోనే ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దీనికి రాష్ట్రపతి కూడా ఇంతకుముందే ఆమోదం తెలిపారు. ఈ ఆర్డినెన్స్ ప్రకారం సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను 37కు పెంచుకోవచ్చు. అయితే, దీన్ని పూర్తిస్థాయి చట్టంగా తీసుకురావాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. అందుకోసమే బిల్లును రూపొందించి, ప్రవేశపెట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 ప్రకారం సుప్రీకోర్టు జడ్జీల సంఖ్యను చట్టం ద్వారా పార్లమెంటే నిర్ణయించవచ్చు. దీనికోసం సాధారణ మెజారిటీ ఉంటే చాలు. ఇతర రాజ్యాంగ సవరణ చట్టాలలాగా మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం లేదు. దీంతో ఈ బిల్లు త్వరగానే ఆమోదం పొందే అవకాశం ఉంది. ఇదే జరిగితే ఇప్పుడు సుప్రీంకోర్టుకు 37 మంది జడ్జీలు ఉంటారు. అదనంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడా. సీజేఐతో కలిపితే మొత్తం 38 మంది జడ్జీలు అవుతారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో 32 మంది జడ్జీలు పని చేస్తున్నారు. ఎన్‌డీయే ప్రభుత్వం గతంలో 2019లోనే జడ్జీల సంఖ్యను ఒకసారి పెంచింది. ఇప్పుడు మరోసారి పెంచేందుకు సిద్ధమైంది. భారత సుప్రీంకోర్టు జడ్జీలకు సంబంధించి గతంలో ఉన్న సంఖ్య ఇది. 1956లో సుప్రీంకోర్టులో సీజేఐతో కలిపి 10 మంది జడ్జీలు ఉండేవారు. ఆ తర్వాత దీన్ని 1960లో 13కు పెంచింది అప్పటి కేంద్ర ప్రభుత్వం. ఆ తర్వాత 1977లో 17కు, 1986లో 25కు, 2008లో 30కి, 2019లో 33కు పెంచారు.


## తెలంగాణలో విమానాశ్రాయాలపై కేంద్రం వివరణ

### వేం నరేందర్ రెడ్డి ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానం

న్యూఢిల్లీ,జులై 20: రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ వేం నరేందర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆదిలాబాద్, పెద్దపల్లి, కొత్తగూడెం విమానాశ్రయాలపై కీలక అప్‌డేట్ ఇచ్చారు. మామునూరు ఎయిర్‌పోర్టు పనులకు టెండర్లు పిలిచామని తెలిపారు. తెలంగాణలో ఉడాన్ పథకం కింద ఇప్పటివరకు 58 రూట్లు అందుబాటులోకి తెచ్చామన్నారు. వరంగల్ జిల్లా మామునూరు విమానాశ్రయ అభివృద్ధి పనుల్లో వేగం పెరిగిందని వెల్లడించారు. రూ. 496.86 కోట్ల అంచనా వ్యయంతో (జీఎస్టీతో కలిపి) మామునూరు విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసేందుకు ఏఏఐ సూత్రప్రాయ ఆమోదం తెలిపింది.

## క్షమించడం బలహీనత కాదు... ఆత్మస్థైర్యం!

**ప్రేమ అనే పదం వినగానే సగటు మానవ మనసులో మెరిసే భావాలు ఆప్యాయత, అనురాగం, తోడు, భరోసా. కానీ ఈ అందమైన భావోద్వేగాల వెనుక దాగి ఉన్న అత్యంత సంక్లిష్టమైన, కఠినమైన సవాలు ఒకటుంది. అదే క్షమాపణ. ఇద్దరు వ్యక్తులు ఎంతగా ప్రేమించుకున్నా, ఎంత గాఢంగా అనుబంధాన్ని పెంచుకున్నా, జీవిత ప్రయాణంలో ఏదో ఒక దశలో మనస్పర్థలు, గాయపరిచే సందర్భాలు తలెత్తడం సహజం. పొరపాటు మాటలు మనసును గాయపరచవచ్చు, మౌనం ఆత్మీయతకు దూరం పెంచవచ్చు లేదా ఊహించని తప్పులు నమ్మక పునాదులను కదిలించవచ్చు.**



అటువంటి క్లిష్ట క్షణాల్లో బంధం నిజంగా నిలబడుతుందా లేదా అనేది, భాగస్వాములకు ఒకరినొకరు క్షమించగలిగే హృదయ వైశాల్యం ఉందా లేదా అనే అంశంపైనే ఆధారపడి ఉంటుంది. మానవ మనస్తత్వం సహజంగానే ఆత్మరక్షణకు ప్రాధాన్యమిస్తుంది. ఎవరైనా తమను బాధపెట్టినప్పుడు, ఆ చేదు అనుభవాన్ని గుర్తుంచుకోవడం ద్వారా భవిష్యత్తులో అలాంటి గాయాల బారిన పడకుండా ఉండవచ్చని మనస్సు భావిస్తుంది. అందుకే చాలామంది దృష్టిలో క్షమించడం అంటే కేవలం గతాన్ని మరచిపోవడం కాదు, అది తమను తాము మళ్ళీ బలహీన పరచుకోవడమే. ముఖ్యంగా దాంపత్య లేదా ప్రేమ బంధాలలో నమ్మకద్రోహం ఎదురైనప్పుడు, అబద్ధాలు వెలుగు చూసినప్పుడు లేదా తీవ్ర నిర్లక్ష్యం వల్ల మనసు గాయపడినప్పుడు క్షమించడం అనేది స్వల్ప వ్యవధిలో తీసుకునే నిర్ణయం కాదు. అది హృదయానికి, విచక్షణా జ్ఞానానికి మధ్య సాగే సుదీర్ఘమైన అంతర్మథనం. అయితే ఇక్కడ గమనించాల్సిన కీలకమైన విషయమేమిటంటే క్షమించడం అంటే ఎదుటివారు చేసిన తప్పును సమర్థించడం కాదు, దానిని అసలే జరగనట్లు విస్మరించడం అంతకన్నా కాదు. క్షమాపణ అనేది ఆ వేదనకు తనను తాను శాశ్వతంగా ఖైదీగా మార్చుకోకుండా, స్వేచ్ఛగా ముందుకు సాగేందుకు చూపే ఆత్మస్థైర్యం. ఇది కేవలం ఎదుటివారి సంతోషం కోసం చేసే త్యాగం కాదు, తన సొంత మనశ్శాంతి కోసం తీసుకునే వివేకవంతమైన నిర్ణయం. నేటి ఆధునిక సమాజంలో అనేక అనుబంధాలు విచ్ఛిన్నం కావడానికి మూలకారణం ప్రేమ లోపించడం కాదు, భాగస్వాముల మధ్య అహంకారం (ఈగో) అడ్డురావడమేనని మానసిక విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. నేనెందుకు తగ్గాలో, తప్పు వాళ్ళు చేసినప్పుడు నేనెందుకు క్షమించాలో అనే భావన మానసిక గోడలను నిర్మిస్తుంది. ఈ ఆలోచనలో తర్కం ఉన్నప్పటికీ, దానికే పట్టుబట్టి కూర్చుంటే బంధాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. ప్రేమ అంటే ఇద్దరు పరిపూర్ణ వ్యక్తుల కలయిక కాదు, ఇద్దరు లోపాలున్న మనుషులు ఒకరి బలహీనతలను మరొకరు అర్థం చేసుకుంటూ సమన్వయంతో సాగే సుదీర్ఘ ప్రయాణం. ఈ పరిణతి ఉన్నప్పుడే క్షమాపణ అనేది బలవంతపు చర్యలా కాకుండా సహజ సిద్ధమైన భావనగా వ్యక్తమవుతుంది. మన పెద్దలు తరచూ చెప్పే ఒక అనుభవపూర్వక మాట ఉంది ప్రేమించడం సులభం, కానీ ఆ ప్రేమను నిలబెట్టుకోవడమే అసలైన సవాలు. ఈ నిలబెట్టుకునే ప్రక్రియలో క్షమాపణ అత్యంత కీలక పాత్ర పోషిస్తుంది. సృష్టిలో ఎవరూ సంపూర్ణులు కారు. ప్రతి ఒక్కరిలో లోటుపాట్లు ఉంటాయి, పొరపాట్లు జరుగుతాయి. అటువంటప్పుడు ఆ తప్పులను హృదయపూర్వకంగా అర్థం చేసుకుని, పునరాలోచనకు మరొక అవకాశం ఇవ్వగలిగే విశాల హృదయం ఉంటేనే ఏ బంధమైనా కాలపరీక్షను తట్టుకుని నిలబడగలదు. సామాజిక దృక్పథంలో చాలామంది క్షమాపణను బలహీనతగా, ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడంగా పొరబడుతుంటారు. కానీ వాస్తవానికి ఒకరిని క్షమించడం అనేది అత్యంత ధైర్యవంతమైన చర్య. మరొకసారి గాయపడే అవకాశం ఉందని తెలిసి కూడా, నమ్మకాన్ని పునర్నిర్మించుకునేందుకు చూపే సాహసమది. బలహీనమైన మనసు ఉన్నవారు పగను, ద్వేషాన్ని పెంచుకోవడానికే మొగ్గు చూపుతారు. కానీ మానసిక పరిణతి, ఆత్మస్థైర్యం ఉన్న వ్యక్తులు మాత్రమే క్షమించి ముందుకు సాగగలరు. అయితే, ప్రతి పొరపాటునూ బ్లైండ్‌గా క్షమిస్తూ పోవడం ఆరోగ్యకరమైన సంస్కృతి కాదు. పదే పదే జరిగే మోసాలు, గౌరవప్రతిష్టలను దిగజార్చే ప్రవర్తన, శారీరక లేదా మానసిక హింస వంటి తీవ్రమైన అంశాల్లో క్షమాపణ అనేది అంధకార సహనంగా మారకూడదు. క్షమించడం అంటే ఆత్మగౌరవాన్ని కోల్పోవడం కాదు. నిజమైన క్షమాపణకు, స్వీయ గౌరవాన్ని దిగజార్చే సహనానికి మధ్య స్పష్టమైన గీత ఉండాలి. ఈ వ్యత్యాసాన్ని గుర్తించలేకపోతే, ఆ బంధం మానసిక ఆరోగ్యానికి హానికరంగా మారే ప్రమాదం ఉంది. ఏ సంబంధమైనా ప్రారంభంలో ఉండే ఆకర్షణతోనో, బాహ్య సౌందర్యంతోనో సుదీర్ఘకాలం నిలబడదు. కష్టకాలంలో, విభేదాలు తలెత్తినప్పుడే ఆ బంధం యొక్క అసలు లోతు బయటపడుతుంది. మాట పట్టింపులు వచ్చినప్పుడు, నమ్మకాలు సడలినప్పుడు ఆ క్షణంలో భాగస్వాములు ఎలా స్పందిస్తారు అనేదే వారి అనుబంధం యొక్క నాణ్యతను నిర్ధారిస్తుంది. ఆవేశంతో బంధాన్ని తెంచుకోవడం క్షణంలో జరిగే పనే, కానీ కలిసి కూర్చుని మాట్లాడుకుని, అపార్థాలను తొలగించుకుని, హృదయపూర్వకంగా క్షమించుకుని తిరిగి ప్రయాణాన్ని కొనసాగించడం పరిణతి చెందిన ప్రేమకు సంకేతం. సుదీర్ఘ దాంపత్య జీవితాన్ని గడిపిన దంపతులను పరిశీలిస్తే ఈ నిజం అవగతమవుతుంది. దశాబ్దాల తరబడి కలిసి జీవిస్తున్న జంటలకు సమస్యలు లేదా గొడవలు రాకుండా లేవు. వారి విజయ రహస్యం ఏమిటంటే ప్రతి ప్రతిష్టంభన తర్వాత ఒకరినొకరు అర్థం చేసుకుని, క్షమించుకుని, తిరిగి కలిసిపోగలిగే నేర్పు. ఈ విశిష్ట గుణమే వారి బంధాన్ని కాలక్రమేణా మరింత దృఢంగా మార్చింది. మనం ఎవరినైనా క్షమించనంత కాలం, ఆ ద్వేషభారాన్ని, కోపాన్ని మన అంతరంగంలోనే మోస్తూ తీవ్ర మనోవేదనకు గురవుతాము. అవతలి వ్యక్తులు తమ రోజువారీ జీవితంలో ముందుకు సాగిపోయినా, క్షమించలేని వ్యక్తి మాత్రం ఆ చేదు గతంలోనే బంధీగా ఉండిపోతారు. క్షమాపణ చెప్పిన క్షణంలోనే ఆ భారమైన గతం నుండి నిజమైన మానసిక విముక్తి లభిస్తుంది. ఇది ఎదుటివారికి చేసే ఉపకారం ఎంతమాత్రమూ కాదు, తన మనసుకు తాను ఇచ్చుకునే అమూల్యమైన స్వేచ్ఛ. ముగింపుగా చెప్పాలంటే, క్షమించడం అనేది ప్రేమకు అత్యంత సంక్లిష్టమైన, అలాగే అత్యున్నతమైన పరీక్ష. ఈ పరీక్షలో నెగ్గిన అనుబంధాలు మాత్రమే కాలానికి, మారుతున్న పరిస్థితులకు, జీవితంలోని ఒడిదుడుకులకు ఎదురొడ్డి నిలబడగలవు. ప్రేమను ప్రకటించడం సులభమే కావచ్చు, కానీ క్షమించే గుణం ద్వారానే ఆ ప్రేమకు దివ్యమైన అర్థం, పవిత్రమైన లోతు చేకూరుతాయి. అందుకే క్షమాపణనే అనుబంధాల మనుగడకు అంతిమ సూత్రంగా పేర్కొనవచ్చు.




డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169


## ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవడంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణకు నాంది కావాలి

**ప్రభుత్వ యంత్రాంగం మిషన్ మోడ్‌లో పనిచేయాలి.. ఆరుతడి పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించాలి**

**ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరి, రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలి**

**ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ**



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు, ప్రజల ప్రయోజనాల పరిరక్షణే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. ప్రకృతి విపత్తులను ముందుగానే అంచనా వేసి, వాటి ప్రభావాన్ని తగ్గించే దిశగా ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసిందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే విషయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని, అధికారులు సమష్టి బాధ్యతతో పనిచేసి తెలంగాణకు మార్గదర్శకంగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ యంత్రాంగం గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఒకే లక్ష్యంతో పనిచేయాలని, పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ వరకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి సూచించారు. ప్రజాప్రతినిధుల సూచనలను గౌరవిస్తూ, క్షేత్రస్థాయిలో రైతులకు ధైర్యం, భరోసా కల్పించే చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి బి. షఫీయుల్లా, నాగర్ కర్నూల్ జిల్లా నుండి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ , కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, నీటిపారుదల, భూగర్భజల వనరులు, మిషన్ భగీరథ, ఉపాధి హామీ, విద్యుత్, పాడి పరిశ్రమలు, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు జిల్లాల వారీగా పరిస్థితులను వివరించి, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే కార్యాచరణను సమావేశంలో సమర్పించారు. మంత్రి మాట్లాడుతూ..., రానున్న పది రోజులు అత్యంత కీలకమని మంత్రి తెలిపారు. ఈ సమయంలో రైతులకు సరైన సమాచారం అందించి, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల మార్పిడి చేపట్టేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విత్తనాల లభ్యత, సబ్సిడీ, ఎరువుల పంపిణీ, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం వంటి అంశాలపై తక్షణ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే కందులు, పెసలు, మినుములు, నువ్వులు, వేరుశనగ, జొన్నలు, సజ్జలు, రాగులు, ఇతర చిరుధాన్యాలు, ఉద్యాన పంటలను విస్తృతంగా ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. నేల స్వభావం, వర్షపాతం, భూగర్భ జలాల లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులకు తగిన సలహాలు ఇవ్వాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు సూచించారు. ప్రతి రైతుకు వారి గ్రామ పరిస్థితులకు అనుగుణంగా ఏ పంట వేయాలో స్పష్టమైన మార్గదర్శకాలు అందించాలని, రైతు వేదికలు, గ్రామసభలు, రైతు నేస్తం కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. భూగర్భ జలాల పరిస్థితి, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, సాగునీటి లభ్యతపై ప్రతి రైతుకు పూర్తి సమాచారం అందించాలని మంత్రి తెలిపారు. నీటి వినియోగంలో పొదుపు పాటించేలా ప్రజల్లో అవగాహన పెంచాలని, తాగునీటి కొరత తలెత్తకుండా మిషన్ భగీరథ అధికారులు ముందస్తు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా ప్రతి గ్రామంలో పెద్దఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఈ పనులను వేగవంతం చేయాలని, గ్రామ పంచాయతీలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించడంలో ఇంకుడు గుంతలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. విద్యుత్, పాడి పరిశ్రమ, వైద్య ఆరోగ్యం, పశుసంవర్ధక, రెవెన్యూ, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఉపాధి హామీ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు వాతావరణ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటలు, విత్తనాల లభ్యత, ప్రభుత్వ సహాయం వంటి అంశాలపై ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. రైతులకు అవసరమైన సమాచారం సకాలంలో చేరేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. శాఖల వారీగా పూర్తి స్థాయి నివేదికలు సిద్ధం చేసి శుక్రవారం జరిగే సమీక్ష సమావేశానికి హాజరు కావాలని మంత్రి ఆదేశించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల అధికారులతో మరో సమీక్ష నిర్వహించి జిల్లాల వారీగా కార్యాచరణను ఖరారు చేయనున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడం ఒక్క ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అధికారులు, ప్రజాప్రతినిధులు, శాస్త్రవేత్తలు, రైతులు, ప్రజలు అందరూ సమష్టిగా కృషి చేస్తేనే నష్టాలను తగ్గించగలమని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ముందస్తు ప్రణాళిక, సమన్వయం, ప్రజల్లో అవగాహన, నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణ రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

**తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూ...., ఉమ్మడి**

మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 50 శాతం మేర మాత్రమే సాగు విస్తీర్ణంలో పంటల విత్తనాలు పూర్తయ్యాయని, మిగిలిన 50 శాతం విస్తీర్ణంలో ఇంకా సాగు ప్రారంభం కాలేదని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఇప్పటికే సాగు చేసిన పంటలను శాస్త్రీయ పద్ధతుల్లో సంరక్షిస్తూ, తేమను నిల్వ చేసుకునే విధానాలు, పంటల రక్షణ చర్యలను పాటించాలని రైతులకు సూచించారు. మిగిలిన సాగు విస్తీర్ణంలో రైతులు తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే, తక్కువ పెట్టుబడితో సాగు చేయగల కూరగాయల పంటలు, పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలు, ఉద్యాన పంటల సాగుపై దృష్టి పెట్టేలా వ్యవసాయ అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అన్నారు. రైతులకు పంటల ఎంపిక, విత్తనాల లభ్యత, సాగు పద్ధతులు, మార్కెటింగ్ అవకాశాలపై సమగ్ర అవగాహన కల్పించడం ద్వారా నష్టాలను తగ్గించి ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా నాగర్‌కర్నూలు జిల్లాలో వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలైన ఆయిల్ పామ్‌తో పాటు ఇతర వాణిజ్య, ఉద్యాన పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. నీటి లభ్యత, నేల స్వభావం, వాతావరణ పరిస్థితులను బట్టి ఏ పంటలు అనుకూలమవుతాయో రైతులకు క్షేత్రస్థాయిలో వివరించడం వల్ల మంచి ఫలితాలు కనిపిస్తున్నాయని చెప్పారు. ఈ విధానాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కూడా అమలు చేసి, రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి చేపట్టేలా ప్రోత్సహించాలని అధికారులను కోరారు. ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు సాగు ఖర్చును కూడా నియంత్రించవచ్చని చిన్నారెడ్డి తెలిపారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని, వ్యవసాయాన్ని లాభసాటి వృత్తిగా మార్చేందుకు ప్రభుత్వం, వ్యవసాయ శాఖ, శాస్త్రవేత్తలు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ స్థాయిలో రైతు సమావేశాలు, అవగాహన సదస్సులు, క్షేత్ర ప్రదర్శనలు నిర్వహిస్తూ శాస్త్రీయ సాగు పద్ధతులను రైతులకు చేరవేయాలని, ప్రతి రైతు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సరైన నిర్ణయాలు తీసుకునేలా వ్యవసాయ విస్తరణ అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని చిన్నారెడ్డి సూచించారు. రైతుల ఆదాయాన్ని కాపాడటం, సాగును స్థిరంగా కొనసాగించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రైతులకు అవగాహన కల్పించేలా రాష్ట్రం నుంచి జిల్లాలకు ఎలా అయితే ప్రత్యేక అధికారి నిర్మించారో, అదేవిధంగా అన్ని జిల్లాల్లో మండలాలకు ప్రత్యేక అధికారుల నిర్మించి రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. రానున్న 15 రోజుల్లో ప్రణాళికలను పూర్తి చేసి రాష్ట్రస్థాయి పంపించాలా అధికారం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రస్తుత వర్షాభావ ప్రభావంతో గ్రామాల్లో రైతులకు ప్రజలకు ప్రజలకు పనులు కల్పించేలా జిరాంజి ఉపాధి పథకం ద్వారా ప్రతిరోజు గ్రామాల్లో ప్రజలకు తప్పనిసరిగా పనులు కల్పించి వారి జీవనోపాధికి కృషి చేయాలని అధికారులకు సూచించారు.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు కావాలి..**

**ఆగస్టు 3లోగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించాలని సూచన**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని బిజినపల్లి మండలం వట్టెం గ్రామంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) డిజిటలైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ హెమంత కేశవ్ పాటీల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిజిటలైజేషన్ ప్రక్రియ పురోగతిని పరిశీలించిన ఆయన, అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడి చేపడుతున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఓటరికి ఈ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించాలని, ఆగస్టు 3వ తేదీలోగా ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని వారి వివరాలు ఓటర్ల జాబితాలో నమోదు కాకపోవచ్చనే విషయాన్ని ప్రతి ఓటరికి స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా నమోదు ప్రక్రియకు దూరం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవసరమైన సమాచారం అందిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు డిజిటలైజేషన్ ప్రక్రియలో తప్పనిసరిగా నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, అనర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో కొనసాగకుండా చూడడంతో పాటు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటరు నమోదు (డూప్లికేట్ నమోదు) జరగకుండా అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందేలా ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ వెంట నాగర్‌కర్నూల్ ఆర్డీవో అర్చన, బిజినపల్లి తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీవో, బీఎల్‌వోలు, డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్న అధికారులు తదితరులు ఉన్నారు.

# 18 సంవత్సరాల నుండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలి

**హైదర్ నగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు డి. నిఖిల్**



**కూకట్ పల్లి, జూలై 20 (క్రైమ్ మిర్రర్) :** 18 సంవత్సరాల నిన్నే ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని హైదర్ నగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నిఖిల్ అన్నారు. శేర్లింగంపల్లి నియోజకవర్గం, హైదర్ నగర్ పరిధిలో ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా డివిజన్ పరిధిలోని నాగార్జున హోమ్స్ లో కొనసాగుతున్న సర్వే కార్యక్రమంలో హైదర్ నగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు డి. నిఖిల్ పాల్గొన్నారు. సందర్భంగా హైదర్ నగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నిఖిల్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవడంతో పాటు అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులను నిర్ణీత గడువులోపు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాకేశ్, తరుణ్, మహేందర్, కిరణ్, సామ్యూల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595

# సమన్వయంతో సాగిన సర్.. 'పలిమలలో విశేష పురోగతి'

**జిల్లా కార్యదర్శుల పర్యవేక్షణలో 94 శాతం ప్రక్రియ పూర్తి**

**100 శాతం లక్ష్యంతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ నాయకులు**



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా పలిమల మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి 94 శాతం ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించడం, నమోదు ఫారాలను పూర్తి చేయించడం, అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చేలా అవగాహన కల్పించడం వంటి కార్యక్రవాలను విస్తృతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శులు ఆకుతోట సుధాకర్, మడక ప్రతాప్ రెడ్డి పలిమల మండల ఇన్‌చార్జిలుగా వ్యవహరిం చి క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. వారి నాయకత్వంలో మండలంలోని అన్ని గ్రామాల్లో కార్యకర్తలు సమన్వయంతో పనిచేయడంతో 94 శాతం సర్ ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుండవేని చిన్నన్న, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దండెర రాజేందర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎర్రవెల్లి వసంతరావు, కిషోర్తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయడానికి కృషి చేశారు. నాయకులు మాట్లాడుతూ, ప్రజలు సర్ కార్యక్రమానికి విశేషంగా సహకరిస్తున్నారని, ఇంకా మిగిలిన ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసి 100 శాతం లక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు తన వివరాలను సరిచూసుకుని అవసరమైన పత్రాలను సమర్పించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



# తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చాలి

**తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు బత్తుల సోమయ్య**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** హైదరాబాదులో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కేకే కమిటీ ఆహ్వానం మేరకు సోమవారం తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు బత్తుల సోమయ్య కమిటీ సభ్యులు అద్దంకి దయాకర్ ఎమ్మెల్సీ రాములు నాయక్ లను కలిసి తెలంగాణ ఉద్యమకారుల కొరకు పలు సలహాలు సూచనలు చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్క ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలం 25 వేల పెన్షన్ ఉచిత రైల్వే బస్సు పాసులు ఇప్పించాలని హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో ఉద్యమకారులకు ఇంటి స్థలం కేటాయించాలని ఉద్యమకారులకు ప్రత్యేకంగా హాస్పటల్ నిర్మించాలని కమిటీకి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా భక్తుల సోమయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కల సహకారం మాత్రమే అయినదని ఇంకా తెలంగాణలో పాలనలో ఆంధ్రుల పెత్తనం కొనసాగుతున్నదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు అంగిడి బిక్షం అనంతుల మధు తునికిపాటి చారీ రాజేష్ నాయక్ కుక్కల సత్యం మీగడ రామారావు ఉల్లంగి పద్మ కలకోట అరుణ మంగీలాల్ నాయక్ రామ్మూర్తి నాయకుడు తుడుం వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



# కల్వకుర్తిలో సంతరించుకున్న ఆధ్యాత్మిక శోభ

**విశ్వశాంతి మహాయాగంలో యాగ ప్రతిష్ట**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** మానవాళి మనుగడ సుఖశాంతులతో సాగాలని సంకల్పిస్తూ శ్రీకృష్ణ కాలచక్రం, విష్ణు పంచాయతనం, ఆయుత చండి, అతి రుద్ర హోమాలతో పాటు కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కల్వకుర్తి పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ గ్రౌండ్లో నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం శివుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోపూజ మహోత్సవం సందర్భంగా గోవులకు పూజలు నిర్వహించి యాగశాల చుట్టూ ప్రదక్షిణలు గోవులతో కలిసి భక్తులు రుత్వికులు నిర్వహించారు. అనంతరం యాగశాల ప్రవేశం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదమంత్రాలతో ఆ ప్రాంతమంతా ఆవహించింది. పండితులు వేదం చదువుతూ హోమం కార్యక్రమాలను ముందుకు వచ్చి తీసుకెళ్లారు. పెద్ద సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి రుత్వికులు అందరినీ సమానం చేస్తూ పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు మూడవ తేదీ వరకు నిర్వహించే హోమాలు, పూజా కార్యక్రమాలలో భక్తులందరూ పాల్గొని దేవుని కృపకు పాత్రులు కావాలన్నారు. ప్రతినిత్యం చేపట్టే కార్యక్రమాలు ప్రతినిత్యం ఆయుత చండి, అతి రుద్రం, ఋగ్వేద యజుర్వేద సామవేద అధర్వణ వేద ఘోష హవనములు, నవగ్రహ హోమం, నక్షత్రయాగం, శ్రీ సుదర్శన హవనం, సూర్య హోమం సూర్య నమస్కారాలు, పాశుపతాస్త్ర హోమం, సుబ్రహ్మణ్య హోమం పుత్ర కామేష్టి హోమం ధన్వంతరి హవనం లక్ష్మీ గణపతి హోమం మహాగణపతి హోమం అష్టలక్ష్మి హోమం లక్ష్మీనారాయణ హోమం హనుమత్ హోమం సరస్వతి హోమం ఉదయం 6 గంటల నుండి రాత్రి వరకు నిర్వహించే విధంగా కార్యక్రమాలను తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ సర్వీసెస్ జూలూరు రమేష్ బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలం యాగనిర్వాహకులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్' ఓటర్ల సవరణ ప్రక్రియపై కీలక సమీక్ష

**క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేసి ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించాలి**

**కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి**



**బాలానగర్, జూలై 20 (క్రైమ్ మిర్రర్) :** క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేసి ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ డివిజన్‌లో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. డివిజన్‌లోని ప్రతి బూత్‌ను సందర్శించి బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), బూత్ స్థాయి ప్రతినిధులతో (బీఎల్ఏలు) కలిసి ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ, పరిశీలనపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) సుదర్శన్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. డివిజన్‌లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా, ఓటరు జాబితాలో ఉన్న తప్పులను సరిదిద్దేలా ప్రతి బూత్ పరిధిలో విస్తృతంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ) ప్రకారం ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ, పరిశీలనతో పాటు ఓటర్లకు అవగాహన కల్పించే కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ప్రతి అర్హుడి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. అనంతరం నాయకులతో సమావేశమై ఫారమ్‌ల పంపిణీ, సేకరణ, పరిశీలనతో పాటు ప్రజలకు అవగాహన కల్పించే అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ డివిజన్ అధ్యక్షుడు మధు గౌడ్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన్న కుమార్, మేడ్చల్ జిల్లా ఫిషర్‌మెన్ కమిటీ వైస్ చైర్మన్, బాలానగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల నరేందర్ ముదిరాజ్, రవి ముదిరాజ్, యూత్ ప్రెసిడెంట్ అర్షద్ సోను, జిల్లా శివ, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 మంగళవారం 21-7-2026

# జయశంకర్ కాలనీ ఫేజ్-2 నూతన కమిటీ సభ్యుల సన్మానం

## కాలనీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చిన మాజీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్, పట్వారి శశిధర్



**కూకట్‌పల్లి, జూలై 20 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ జయశంకర్ కాలనీ ఫేజ్-2లో నూతన కమిటీ సభ్యుల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఇటీవల కాలనీ నూతన అధ్యక్షుడిగా మహమ్మద్ రఫీక్ ఎన్నిక కావడంతో కాలనీ అభివృద్ధి లక్ష్యంగా కొత్త కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను అభినందిస్తూ ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, డివిజన్ నాయకుడు పట్వారీ శశిధర్, రంగారెడ్డి జిల్లా డీసీసీ కార్యదర్శి సత్తూరి శిరీష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను కూడా శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, మహమ్మద్ రఫీక్ చిన్న వయస్సులోనే కాలనీ ప్రజల విశ్వాసాన్ని, ప్రేమాభిమానాలను సంపాదించి నేడు కాలనీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. యువ నాయకుడిగా ఆయన సేవా దృక్పథంతో కాలనీ ప్రజల సమస్యలను గుర్తించి సమర్థవంతంగా పరిష్కరించే దిశగా పనిచేయాలని ఆకాంక్షించారు. జయశంకర్ కాలనీ ఫేజ్-2లో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలు, రోడ్లు, డ్రైనేజీ వంటి ప్రజా సమస్యల పరిష్కారానికి కొత్త కమిటీ చొరవ తీసుకుని ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవాభావంతో పనిచేస్తే కాలనీ మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అలాగే కాలనీ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వీలైనంత త్వరగా పరిష్కరిం చేందుకు కృషి చేస్తామని పట్వారీ శశిధర్ హామీ ఇచ్చారు. ప్రజల అభ్యున్నతే తమ లక్ష్యమని, కాలనీ అభివృద్ధికి అవసరమైన ప్రతి విషయంలో అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. నూతన అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన కాలనీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ సభ్యులతో కలిసి ప్రతి కుటుంబ సమస్యను తెలుసుకుని, కాలనీ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. ప్రజల సహకారంతో జయశంకర్ కాలనీని ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ కాలనీ అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్, రాజమణి, కె. విజయ్ కుమార్, ఐ. అంజలి, శివరాం, ప్రభాకర్, శాంతి, శ్యామ్, వినోద్, విజయలక్ష్మి, కమిటీ సభ్యులు, కాలనీవాసులు, యువకులు, మహిళలు, టీం పట్వారీ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన కమిటీ ఏర్పాటుతో జయశంకర్ కాలనీ ఫేజ్-2లో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం అవుతాయనే ఆశాభావాన్ని స్థానికులు వ్యక్తం చేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.



## బిక్షపతి చారికి శుభాకాంక్షల వెల్లువ

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట్ కార్పొరేషన్ భారతీయ జనతా పార్టీ క్లస్టర్ 1 అధ్యక్షులు మాజీ కార్పొరేటర్ పసునూరి బిక్షపతి చారి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం బిక్షపతి చారి కార్యాలయం వద్దకి మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి విచ్చేసి శాలువ కప్పి గజామలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. పుట్టినరోజు వేడుకల్లో పలువురు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలంటే అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్ నమోదు చేసుకోవాలి

### ఓటు హక్కు అనేది ప్రతి ఒక్కరి హక్కు.. సామాజిక కార్యకర్త కోల రవీందర్



**కుత్బుల్లాపూర్, జూలై 20 (క్రైమ్ మిర్రర్) :** ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలంటే అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్ నమోదు చేసుకోవాలని సామాజిక కార్యకర్త కూల రవీందర్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, సూరారం కాలనీలో సామాజిక కార్యకర్త కూల రవీందర్ సోమవారం ప్లక్కాడ్ పట్టుకుని స్థానిక ప్రజలకు ఎస్ఆర్ఐ పై అవగాహన కల్పించారు. అనంతరం సామాజిక కార్యకర్త కోల రవీందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఓటు హక్కు అనేది ఒకే చోట ఉండాలని రెండు చోట్ల ఉంటే నేరమని అన్నారు. 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధం అని అన్నారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యత మనందరిపై ఉందని, ఎస్ ఆర్ ఐ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి" అని పిలుపునిచ్చారు. అడ్రస్ మార్పు, కరెక్షన్ల కోసం ప్రజలు ఫారం-6, 7, 8 లను స్థానిక బిఎల్ఓ లకు అందజేయవచ్చని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలంటే ప్రతి అర్హులైన ఓటరు పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు కావడం ఎంతో ముఖ్యమని, ఈ బాధ్యతను ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో నిర్వర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తాను ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉండేందుకు కట్టుబడిఉంటానని తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలి

రా



**కూకట్ పల్లి, జూలై 20 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ డివిజన్‌లో పులి శివా గౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ (సర్) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ కార్యక్రమంలో పాల్గొని నిర్వాహకులను అభినందించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ, కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజలతో నిత్యం అనుసంధానమై ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పులి శివా గౌడ్‌తో పాటు పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను బండి రమేష్ అభినందించారు. బాలానగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్ప రెడ్డి, శ్రీకాంత్ పటేల్, తూము వేణు, రామ్మోహన్, మదన్మోహన్, శ్రీకాంత్ గౌడ్, యువజన నాయకులు, మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గండిపేట(క్రైమ్ మిర్రర్): ఎన్‌పిఏ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాఘవేంద్ర కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఆదర్శనగర్, అక్బర్ హిల్స్, ఆలీమసీద్, బికె పురం, బాబానగర్, బాబుల్‌రెడ్డినగర్, చింతల్‌మెట్, చింతల్‌మెట్ టవర్స్ ఎక్సెల్ స్కూల్, కింగ్స్ కాలనీ, హసన్‌నగర్, హెచ్‌వి ఆరాంఘర్, హెచ్‌వి శివరాంపల్లి, ఇమాద్‌నగర్, జలాల్‌బాబానగర్, సాయిబాబానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు అక్బర్ హిల్స్, బాబుల్‌రెడ్డినగర్, కే శివరాంపల్లి, మణికంఠ కాలనీ, ఎన్‌పిఏ అండ్ ఎస్సీ కాలనీ, ప్రగతి కాలనీ, రాఘవేంద్ర కాలనీ, సాయిబాబానగర్, సులేమాన్‌నగర్--సి, వాదేఈ సులేమాన్‌నగర్, వీకర్‌సెక్షన్ కాలనీ తదితర ప్రాంతాల్లో చెట్ల నరికివేత కారణంగా కోత విధిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

## ఓటరు కార్డు ఉందని నిర్లక్ష్యం చేయొద్దు

### సర్ ఫారమ్ సమర్పణపై గడ్డం శేఖర్ యాదవ్ పిలుపు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఓటరు గుర్తింపు కార్డు ఉన్నంత మాత్రాన ఓటరు జాబితాలో పేరు శాశ్వతంగా ఉంటుందని భావించి నిర్లక్ష్యం చేయవద్దని నర్కుడ గ్రామ సర్పంచ్, శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం శేఖర్ యాదవ్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఓటర్లు తమ సర్ ఫారమ్‌ను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ ఫారమ్‌ను సమర్పించకపోతే, నిబంధనల ప్రకారం ఓటరు జాబితా నుండి పేరు తొలగించే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. దీనివల్ల గుర్తింపు కార్డు ఉన్నప్పటికీ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణలో సర్ ఫారమ్‌లను సమర్పించడానికి ఆగస్టు 3, 2026 చివరి తేదీగా నిర్ణయించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ ఎంతో విలువైనదని పేర్కొంటూ.. ఓటర్లందరూ వెంటనే తమ పరిధిలోని బూత్ లెవల్ అధికారులను సంప్రదించాలని శేఖర్ యాదవ్ సూచించారు. ఎన్యూమరేషన్ ఫారమ్‌లలో సరైన సమాచారాన్ని జాగ్రత్తగా నింపి అధికారులకు అందజేయడం ద్వారా తమ ఓటు హక్కును భద్రపరచుకోవాలని, మీ ఓటు... మీ హక్కు... మీ బాధ్యత అని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల దాడి అత్యంత దురదృష్టకరం

### తీవ్రంగా ఖండించిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** నీట్ పేపర్ లీకేజీపై దేశ వ్యాప్తంగా విద్యార్థి, యువజనులు చేపట్టిన ఉద్యమం లో భాగంగా సోమవారం ఢిల్లీలో మార్చ్ టు పార్లమెంట్ ను శాంతియుతంగా నిర్వహిస్తున్న విద్యార్థులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీ చార్జ్ చేయడాన్ని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా ఢిల్లీలో ఉన్న ఆయన ఈ విషయం తెలుసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో విద్యార్థులు తమ సమస్యలను శాంతియుతంగా వ్యక్తం చేసే హక్కు రాజ్యాంగం కల్పించిందని, అలాంటి వారిపై లాఠీచార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం అత్యంత అమానవీయ, కృరమైన చర్య అని, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ వైఫల్యం అని, విద్యార్థుల గొంతుకను అణిచివేసే విధానాలు సమర్థనీయం కావని స్పష్టం చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై నమోదైన కేసులనుఉపసంహరించుకోవడంతో పాటు గాయపడిన వారికి తక్షణ మెరుగైన వైద్య సహాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

## పర్యావరణ పరిరక్షణకు "మేము సైతం

### మర్రిగూడ ఉపాధ్యాయుల వినూత్న సందేశం



**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే సందేశంతో, మర్రిగూడ మండల ఉపాధ్యాయులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులను ఉపయోగిస్తూ "మేము సైతం" అనే సందేశాన్ని ఆచరణలో చూపించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరస్ కార్యక్రమంలో భాగంగా, చదువులో వెనుకబడిన విద్యార్థులకు రెమిడియల్ టీచింగ్‌పై రెండు దశల్లో మొత్తం ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రారంభమైంది. ఈ శిక్షణలో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం భోజనం, టీ, స్నాక్స్ వంటి సౌకర్యాలను కల్పిస్తోంది. అయితే ప్లాస్టిక్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసుల వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు పర్యావరణ కాలుష్యం కూడా పెరుగుతుందనే ఉద్దేశంతో, మండల విద్యాధికారి జి. శారద అనుమతితో, రిసోర్స్ పర్సన్ ఉదావత్ లచ్చిరాం ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మర్రిగూడ కాంప్లెక్స్‌కు 50 స్టీల్ ప్లేట్లు, 50 స్టీల్ గ్లాసులు, వాటర్ బాటిళ్లు అవసరమని రాజపేట తండా సర్పంచ్ కోడాల వెంకటరెడ్డిని కోరగా, ఆయన వెంటనే స్పందించి వాటిని విరాళంగా అందజేశారు. దీనితో శిక్షణలో పాల్గొంటున్న ఉపాధ్యాయులందరూ ప్లాస్టిక్‌కు బదులుగా, స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులను ఉపయోగిస్తూ మధ్యాహ్న భోజనం చేశారు. ఈ చర్య ద్వారా ప్లాస్టిక్ రహిత వాతావరణాన్ని ప్రోత్సహించడంతో పాటు, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని చాటిచెప్పారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకట్ రెడ్డి, మండల విద్యాధికారి జి. శారద మాట్లాడుతూ.. చిన్న చిన్న మార్పుల ద్వారా పెద్ద స్థాయిలో పర్యావరణాన్ని కాపాడే అవకాశం ఉంటుందని, ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే దిశగా అందరూ కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు కూడా ఈ కార్యక్రమాన్ని ఇలానే కొనసాగిస్తూ, భవిష్యత్తులో పాఠశాలల స్థాయిలోనూ ప్లాస్టిక్ రహిత కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జటావత్ రూప్‌సింగ్, రిసోర్స్ పర్సన్స్ ఉదావత్ లచ్చిరాం, వెంకటేశ్వర్లు, బాల్తి రజనీకాంత్, ఎం. నాగేంద్ర, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాస బాలరాజు, శ్రీశైలం, గ్యార వెంకటయ్య, ఉపేందర్, కొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# శివన్నగూడెం--తెరటిపల్లి ఆర్అండ్‌బి రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**మర్రిగూడెం(క్రైమ్ మిర్రర్):** మర్రిగూడ మండల ప్రజల రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే దిశగా మరో కీలక అడుగు పడింది. శివన్నగూడెం గ్రామం నుంచి వయా ఇందుర్తి, కొట్టాల నామాపురం మీదుగా తెరటిపల్లి గ్రామం వరకు సుమారు 9.2 కిలోమీటర్ల మేర, ఆర్అండ్‌బి రహదారి అభివృద్ధి పనులకు 30 కోట్ల 50 లక్షల వ్యయంతో, చేపట్టనున్న పనులకు సోమవారం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారుల నిర్మాణమే అభివృద్ధికి పునాది అని అన్నారు. ప్రజలకు నాణ్యమైన రోడ్లు అందుబాటులోకి వస్తే రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, విద్యార్థుల రాకపోకలు, అత్యవసర సేవల నిర్వహణ సులభతరం అవుతాయని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. శివన్నగూడెం, ఇందుర్తి, కొట్టాల నామాపురం, తెరటిపల్లి గ్రామాల ప్రజలు చాలా కాలంగా ఈ రహదారి అభివృద్ధిని కోరుతున్నారని, ఇప్పుడు భారీ నిధులతో చేపట్టనున్న పనులు పూర్తయిన అనంతరం, ప్రయాణం మరింత సురక్షితంగా, సౌకర్యవంతంగా మారుతుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ రహదారి నిర్మాణంతో మండలంలోని పలు గ్రామాల మధ్య అనుసంధానం బలోపేతం కావడంతో పాటు వాణిజ్య, వ్యవసాయ, విద్యా రంగాలకు కూడా ప్రయోజనం చేకూరుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు రాందాస్ శ్రీనివాస్, మాల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శ్రీను, సర్పంచ్ లు రాపోలు యాదగిరి, కళ్లెట్ల లింగయ్య, సీనియర్ నాయకులు చిట్యాల రంగారెడ్డి, ముద్దం నర్సింహ, ఆర్అండ్‌బి శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, వివిధ గ్రామాల ప్రజలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు



## ప్రభుత్వ పాఠశాలకు ఆర్థిక సహాయం.

**కేశంపేట(క్రైమ్ మిర్రర్):** మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామ ప్రభుత్వ పాఠశాల సుందరీకరణకు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయ కమిటీ సభ్యుడు బీస కరుణాకర్ రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి పదివేల రూపాయలను ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని మౌలిక సదుపాయాలకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తానని ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పవన కుమారి, ఉపాధ్యాయులు దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి రంగయ్య, మాజీ ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి,వార్డు సభ్యులు పోగుల నర్సింలు,కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిటి రెడ్డి వెంకట్ రెడ్డి,గుత్తి శేఖర్, పాండురంగారెడ్డి,నారంజి,తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం

- టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి
- ఘనంగా మంచాల, యాచారం మండలాల సంయుక్త సమావేశం
- జర్నలిస్టులు అందరికీ అక్రెడిటేషన్లు, హెల్త్ కార్డుల మంజూరుకై ప్రభుత్వంతో చర్చలు
- పాల్గొన్న రంగా రెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సలీమ్ పాషా, మేకల సత్యనారాయణ



గండిపేట(క్రైమ్ మిర్రర్): జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఖఔజీ) నిరంతరం అండగా ఉంటుందని, సమస్యల సాధనలో రాజీలేని పోరాటం చేస్తుందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం నాడు మంచాల, యాచారం మండలాల టీయూడబ్ల్యూజే సంయుక్త విస్తృత స్థాయి సమావేశం రంగా రెడ్డి జిల్లా మంచాల మండలం కాగజ్ ఘాట్ లోని సిరి నేచర్ వ్యాలీ రిసార్ట్ లో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో రాత్రింబవళ్లు శ్రమిస్తూ, సమాజ శ్రేయస్సుకై పాటుపడుతున్న వర్కింగ్ జర్నలిస్టులకు కనీస సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జర్నలిస్టుల ప్రధాన డిమాండ్లయిన అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్రెడిటేషన్ కార్డుల మంజూరు, కార్పొరేట్ వైద్యం అందేలా ఉచిత హెల్త్ కార్డుల పునరుద్ధరణ, అలాగే కుటుంబాలకు ధీమానిచ్చేలా గ్రూప్ ఇన్సూరెన్స్ (ప్రమాద బీమా) సౌకర్యం కల్పించే విషయాలపై ఇప్పటికే యూనియన్ తరపున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, వీటి సాధన వరకు ఒత్తిడి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో జర్నలిస్టులంతా విభేదాలు వీడి, ఒకే తాటిపైకి వచ్చి యూనియన్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు సలీం పాషా, ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణలు మాట్లాడుతూ.. మండల స్థాయిలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, స్థానిక సమస్యలపై త్వరలోనే జిల్లా కలెక్టర్, సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు తెలిపారు. జర్నలిస్టులపై ఎక్కడైనా దాడులు లేదా అక్రమ కేసులు జరిగితే యూనియన్ తీవ్రంగా ఖండిస్తుందని, లీగల్ సెల్ ద్వారా వారికి పూర్తి న్యాయ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.ప్రతి నియోజకవర్గం లో హెల్త్ క్యాంపు లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి శశిపాల్ రెడ్డి,ఉపాధ్యక్షులు పాండు యాదవ్, పాండురంగారెడ్డి, సంయుక్త కార్యదర్శులు దారుగుపల్లి సత్యనారాయణ, ఆంజనేయులు, పగిడిమర్రి సూర్యనారాయణ, రమేష్,మాజీ జిల్లా అధ్యక్షులు ఆనంతుల శ్రీనివాస్, ఈ సీ సభ్యులు ఇలియాజ్ షరీఫ్, సీనియర్ నాయకులు భూపాల్ రెడ్డి, శ్రీనివాస్, పాండు, తదితరులు పాల్గొని జర్నలిస్టుల హక్కుల రక్షణకు స్థానిక కమిటీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మంచాల, యాచారం మండలాల పరిధిలోని ప్రింట్, ఎలక్ట్రానిక్, మరియు డిజిటల్ మీడియా జర్నలిస్టులు, వివిధ పత్రికల విలేఖరులు, యూనియన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**టీయూడబ్ల్యూజే మంచాల మండల కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక...**

టీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు కోటప్ప, ప్రధాన కార్యదర్శి రంజిత్, కోశాధికారిగా శాస్త్రి, వైస్ ప్రెసిడెంట్ మహేష్, మధుసూదన్ రెడ్డి కాగాటీయూడబ్ల్యూజే యాచారం మండల కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక టీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు పెంటయ్య, ప్రధాన కార్యదర్శి మహేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ గా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

## బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరి

### డా.సునీల్ కుమార్,మండల ఆరోగ్య విస్తరణ అధికారి దామోదర్



**పెబ్బేరు జూలై 20 క్రైమ్ మిర్రర్ :** 14 నుంచి 15 ఏళ్లలోపు బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరి అని డా.సునీల్ కుమార్,మండల ఆరోగ్య విస్తరణ అధికారి దామోదర్ సూచించారు.పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 14 నుంచి 15 ఏళ్లలోపు బాలికలకు వ్యాక్సిన్ అందించారు.హెచ్‌పీవీ వ్యాక్సిన్ సర్వైకల్ క్యాన్సర్ నివారణలో అత్యంత ప్రభావవంతమైనదని వైద్య సిబ్బంది తెలిపారు.ఈ వ్యాక్సిన్ సర్వైకల్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుందని, పెబ్బేరు పీహెచ్‌సీ, ఆస్పత్రిలో అందుబాటులో ఉందని వైద్యులు తెలిపారు.కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ లీలమ్మ, పార్వతి, స్వరూపరాణి, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్,ఫార్మ్ ఆఫీసర్ కుమారి,ఏఎన్ఎం శారద, లావణ్య,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి

### నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్టిఏను రద్దు చేయాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగర కేంద్రంలోని ఉమెన్స్ కళాశాల వద్ద నుంచి గాంధీ చౌక్ వరకు కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్టిఏను రద్దు చేయాలని నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ ఈరోజు ఎస్ఎఫ్ఐ అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా ఈ నిరసన ప్రదర్శనను నిర్వహించామని దేశవ్యాప్తంగా 22 లక్షలకు పైగా విద్యార్థులు నీట్ పరీక్షలు రాస్తే ప్రశ్నాపత్రం లీక్ కావడం చాలా దుర్మార్గమని దానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రిగా రాజీనామా చేయాలని పరీక్షలు నిర్వహించడం చేతకాని ఎన్టిఏను రద్దు చేయాలని అదే విధంగా 19 రోజులకు పైగా నిరాహార దీక్ష చేసిన సోనమ్ వాంగ్ చుక్ దీక్షను భంగం కలిగించి తీసుకెళ్లడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన అన్నారు. ఆయన దీక్షకు భంగం కలిగిస్తే అదే దీక్ష ప్రాంగణంలో ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు ఆదర్శ్ సజీ, ఎస్ఎఫ్ఐ అఖిల భారత సహాయ కార్యదర్శి ఐ సి గోష్ తదితరులు దీక్షను చేస్తున్నారని. విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరుతూ పార్లమెంటు ముట్టడికి యత్నించిన విద్యార్థులను వారి మద్దతుదారులను పోలీసులు లాఠీచార్జ్ చేసి బెదిరించడం వారిపైన కాల్పులు జరపడం చాలా దుర్మార్గమని బిజెపి ప్రభుత్వం ప్రధాని ఇప్పటికైనా స్పందించి ఎన్టియేను రద్దుచేసి విద్యా శాఖ మంత్రిని బర్తరపు చేయాలని అన్నారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వంకాయల రాజు రాష్ట్ర కమిటీ సభ్యురాలు సాత్విక ఖమ్మం డివిజన్ అధ్యక్షులు త్రినాథ్ జిల్లా కమిటీ సభ్యులు సింధు నాయకులు లోహిత్ కుమార్, శ్యామ్, హారిక, నిఖిల, పద్మశ్రీ, అక్షయ, వీక్షణ, శ్రీవిద్య, తరుణి తదితరులు పాల్గొన్నారు.




## ఆగస్టు 1న ఉపాధ్యాయుల మహా ధర్నా

### పోస్టర్ ఆవిష్కరించిన టీపీయూఎస్ (తపస్)

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 1న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద చేపట్టబోయే మహా ధర్నా పోస్టరును తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో సోమవారం రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా ఆవిష్కరించారు. రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జూపల్లి శ్రీనివాసరావు, తపస్ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి కె. హనుమంత్ రావు కలిసి ఈ పోస్టరును విడుదల చేశారు. పీఆర్సీ రిపోర్టును వెంటనే తెప్పించుకుని 51 శాతం ఫిట్మెంట్ ప్రకటించాలి. పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను, పెండింగ్ బిల్లులను సత్వరం క్లియర్ చేయాలి. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలి. 2008 డీఎస్సీ కాంట్రాక్టు ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలి. ప్రతి ఏటా జూలై 31 కట్ ఆఫ్ డేట్‌గా బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్ విడుదల చేయాలి. టెట్ అర్హత మార్కులను 40 శాతానికి తగ్గించాలి. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దును వర్తింపజేయడంతో పాటు ఎస్ఎస్ఏ, కేజీబీవీ ఉపాధ్యాయులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షులు మదగని బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి గుంజరి బాలకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస రెడ్డి, మండల మహిళా కన్వీనర్ విజయమ్మ, ఉపాధ్యక్షురాలు నాగరాణి, తపస్ సభ్యులు, మండల ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు నీళ్లు లేవు.. కూలీలకు పనిలేదు: బొల్లం మల్లయ్య యాదవ్

### చిలుకూరులో పంట పొలాల పరిశీలన..రైతులు, వ్యవసాయ కూలీలతో మాజీ ఎమ్మెల్యే భేటీ





**కోదాడ జులై 20 (క్రైమ్ మిర్రర్):** చిలుకూరు మండల కేంద్రంలోని పంట పొలాలను పరిశీలించిన కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ రైతులు, వ్యవసాయ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాగునీటి కొరతతో నాట్లతో పచ్చగా కళకళలాడాల్సిన పొలాలు బీడుగా మారే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలపై నిపుణులు ముందుగానే హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం తగిన ముందస్తు చర్యలు తీసుకోలేదని విమర్శించారు.భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బోర్లలో నీరు అందక రైతులు పరిమిత విస్తీర్ణంలోనే సాగు చేస్తున్నారని, రైతులు వ్యవసాయం చేయలేకపోతే వ్యవసాయ కూలీలకు కూడా ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు తప్పవని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు పనుల కోసం ఎదురుచూస్తున్నా ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.సాగునీటి లభ్యతపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వడంతో పాటు కరువు నివారణ చర్యలను అత్యవసరంగా చేపట్టి రైతులు, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో చిలుకూరు గ్రామ ఉప సర్పంచ్ బెల్లంకొండ నాగయ్య సొసైటీ చైర్మన్ అలస కాని జనార్ధన్ చిలుకూరు మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జానకి రామాచారి తాళ్లూరి శ్రీనివాస్, బండి కాశయ్య, అంబాల వెంకటి, బెల్లంకొండ సైదులు, గ్రామ శాఖ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# మీ పదేళ్ల పాలనకు జవాబు చెప్పండి...

**ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించండి ..బిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలు, పాలనలో చేసిన అప్పులపై శ్వేత పత్రం విడుదల చేయండి : బోయపల్లి రాఘవేందర్ రెడ్డి**



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** ఎ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే ముందు, పదేళ్ల పాటు తెలంగాణను పాలించిన బీఆర్ఎస్ పాలనలో చేసిన హామీలు, తీసుకున్న నిర్ణయాలపై ప్రజలకు సమాధానం చెప్పాలని బోయపల్లి రాఘవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మీ పాలనలో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తూ అనేక మంది యువత ప్రాణాలు కోల్పోయారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకులు, నియామకాల జాప్యం, నిరుద్యోగ సమస్యలపై మీ ప్రభుత్వం ఎందుకు విఫలమైంది? ఆ యువత కుటుంబాలకు మీ సమాధానం ఏమిటని ప్రశ్నిస్తూ, బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో వందలాది హామీలు ఇచ్చిన ఆ హామీల్లో ఎన్ని పూర్తిగా అమలు చేశారో శ్వేతపత్రం విడుదల చేసే ధైర్యం కేసీఆర్ కి ఉంద అని, దళితుడినే తెలంగాణ తొలి ముఖ్యమంత్రిని చేస్తా అని రాష్ట్రం మొత్తం వినేలా హామీ ఇచ్చారు. ఆ మాట ఏమైంది? ఆ హామీ ఎందుకు అమలు కాలేదు? దళిత సమాజానికి మీ సమాధానం ఏమిటి? నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల ముందు చెప్పి, లక్షలాది మంది యువతను నమ్మించారు. ఒక్కో నిరుద్యోగికి ఇవ్వాల్సిన భృతి ఎందుకు ఇవ్వలేదు? ఆ హామీ కేవలం ఎన్నికల కోసమేనా?, ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల భూమి ఇస్తామని చెప్పారు. ఎంతమందికి ఇచ్చారు? ఎన్ని కుటుంబాలకు ఆ హామీ నెరవేరింది? శ్వేతపత్రం విడుదల చేసే ధైర్యం ఉందా, డబ్బా ఇళ్లు వద్దు డబుల్ బెడ్‌రూమ్ ముద్దు' అని ప్రజలతో చప్పట్లు కొట్టించుకున్నారు. కానీ పదేళ్ల తర్వాత కూడా పేదవాడి కల కలగానే మిగిలింది. కేసీఆర్ మీ హామీ ప్రకారం ప్రతి పేద కుటుంబానికి ఇల్లు ఇచ్చారా? లేక ఆ నినాదం కూడా ఎన్నికలకే పరిమితమైందా?" కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య" అని గొప్పగా ప్రకటించారు. తెలంగాణలో ప్రతి పేద విద్యార్థికి ఆ హామీ పూర్తిగా అమలైందా? లేక అది కూడా మరో ఎన్నికల నినాదంగానే మిగిలిపోయిందా? ఇవన్నీ పక్కనబెట్టి, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం తప్ప మరొకటి కాదని, పదేళ్ల పాలనలో తెలంగాణను లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టింది ఎవరు, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఆస్తులను తనఖా పెట్టి అప్పులు తెచ్చింది ఎవరు? ఈరోజు ఆర్థిక క్రమశిక్షణ గురించి మాట్లాడే ముందు, మీ పాలనలో చేసిన ప్రతి అప్పుపై, ప్రతి హామీపై, ప్రతి రూపాయి ఖర్చుపై ప్రజలకు లెక్క చెప్పాలని బోయపల్లి రాఘవేందర్ రెడ్డి డిమాండ్ చేస్తూ, తెలంగాణ ప్రజలు అమాయకులు కాదు. ఎవరు హామీలు ఇచ్చి నిలబెట్టుకున్నారో, ఎవరు హామీలు ఇచ్చి మర్చిపోయారో వారికి బాగా తెలుసన్నారు. ముందు మీ పదేళ్ల పాలనకు జవాబు చెప్పండి... ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించండి. తెలంగాణ ప్రజలు మిమ్మల్ని ప్రతిపక్షంలో కూర్చోబెట్టిన తీర్పును ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నట్లు మీ వ్యాఖ్యలు కనిపిస్తున్నాయి. అందుకే ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన చోట, వాస్తవాలను పక్కనబెట్టి నిరాధార విమర్శలకే పరిమితమవుతున్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. అధికారాన్ని కోల్పోయిన బాధతో కాకుండా, ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పండని, తెలంగాణ ప్రజల తీర్పే అంతిమ తీర్పు. ప్రజలను మోసం చేసిన రాజకీయాలకు మళ్లీ అవకాశం ఉండదని బోయపల్లి రాఘవేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో గుర్రం లింగా రెడ్డి, సత్యనారాయణ రావు, ఆర్ల నరసింహ, గుర్రం నరసింహారెడ్డి, పూల్‌సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## శాస్త్రీపురం డివిజన్‌లో ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియ పరిశీలన

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం శాస్త్రీపురం డివిజన్ పరిధిలోని షామా కాలనీలో గల మస్జిద్-ఎ-ఒమర్ షా ప్రాంగణంలో ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియ కార్యక్రమం సోమవారం వేగంగా సాగింది. ఈ ప్రత్యేక ఓటర్ల సవరణ కేంద్రాన్ని రాజేంద్రనగర్ తహశీల్దార్ రాములు, సూపర్‌వైజర్ షంషుద్దీన్, బూత్ లెవల్ అధికారులు సందర్శించారు. ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులు మరియు ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శివరాంపల్లి మాజీ కార్పొరేటర్ జనాబ్ హబీబ్ జైన్ ఆరిఫ్, ఎంఐఎం మహమూద్ నగర్ ప్రైమరీ యూనిట్ ప్రెసిడెంట్ మహ్మద్ జహంగీర్, షామా కాలనీ ప్రైమరీ యూనిట్ ప్రెసిడెంట్ బాబా ఖాన్ సాహబ్, అలాగే స్థానిక నాయకులు మహ్మద్ సోహైల్, మహ్మద్ సయీద్, మహ్మద్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

**హైడ్రా కమిషనర్‌కు బిఆర్ఎస్ నాయకులు శీలం తిరుపతి రెడ్డి వినతి**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** గగన్‌పహాడ్ పరిధిలోని పలు కీలకమైన చెరువుల్లో జరుగుతున్న ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ నాయకులు శీలం తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ని కలిసి, ఆక్రమణల వివరాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. గగన్‌పహాడ్ పరిధిలోని ప్రెస్టీజ్ ప్రాంతంలో ఉన్న చెరువులను పూర్తిస్థాయిలో పరిరక్షించాలని ఆయన కోరారు. పెద్ద చెరువు (98.50 ఎకరాలు), మామిడికుంట చెరువు (19.50 ఎకరాలు), అప్ప చెరువు (40 ఎకరాలు), బ్రాహ్మణ చెరువు, గతంలో మే 25, 2026న సమర్పించిన ఫిర్యాదు (నం. 2579)పై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల తిరుపతి రెడ్డి ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, అక్రమ కట్టడాలను తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ సానుకూలంగా స్పందించారు. ఈ ఆక్రమణల వ్యవహారంపై తక్షణమే క్షేత్రస్థాయి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

## ఔటర్ రింగ్ రోడ్‌పై ఆధునిక హరిత నిర్వహణ

**భద్రత కోసం హెచ్‌ఎండీఏ సరికొత్త వ్యూహం**




**హైదరాబాద్ (క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్ మహానగరానికి మణిహారంగా నిలిచిన ఔటర్ రింగ్ రోడ్ పై రహదారి భద్రతను మరింత మెరుగుపరిచేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ) కీలక నిర్ణయం తీసుకుంది. ఔటర్ రింగ్ రోడ్ పై హరిత నిర్వహణ (గ్రీనరీ మెయింటెనెన్స్) కోసం ఇకపై సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి, పూర్తి ఆధునిక యాంత్రిక విధానాలను అమలు చేయాలని నిశ్చయించింది. గతంలో ప్రధాన క్యారేజ్‌వేపై జరిగిన పలు ప్రాణాంతక ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, ప్రయాణికులతో పాటు క్షేత్రస్థాయి సిబ్బంది ప్రాణాలకు రక్షణ కల్పించేందుకు ఈ మార్పులు చేస్తున్నారు. ఇందులో భాగంగా మానవ శ్రామికులపై ఆధారపడే పద్ధతులను, అలాగే ప్రమాదాలకు కారణమవుతున్న సంప్రదాయ వాటర్ ట్యాంకర్ల వినియోగాన్ని వేగంగా తగ్గిస్తున్నారు. వీటికి బదులుగా ఆటోమేటెడ్ యంత్రాలు, స్వయంచాలక నీటిపారుదల వ్యవస్థలను ప్రవేశపెడుతున్నారు. 158 కి.మీ. పొడవు గల ఈ 8-లేన్ల ఎక్స్‌ప్రెస్‌వేను రూ. 8,821.95 కోట్ల వ్యయంతో దశలవారీగా నిర్మించారు. ఇరువైపులా 2-లేన్ల సర్వీస్ రోడ్లు, 5 మీటర్ల వెడల్పు గల సెంట్రల్ మీడియన్, 19 ఇంటర్‌చేంజ్‌లతో గంటకు 120 కి.మీ. వేగంతో ప్రయాణించేలా దీనిని రూపొందించారు. నగరంలోకి ప్రవేశించే వారికి ప్రధాన ప్రవేశ ద్వారంగా ఉంటూ, హైదరాబాద్ గర్వకారణంగా నిలిచిన ఔటర్ రింగ్ రోడ్‌ను పర్యావరణహితంగా, మరింత సురక్షితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా హెచ్‌ఎండీఏ ఈ ఆధునికీకరణ పనులను వేగవంతం చేస్తోంది.

## రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నేత మృతి



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, జులై 20: మిర్యాలగూడ మండలం కొత్తగూడెం శివారులో అద్దంకి--నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దామరచర్ల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కోట సైదులు అలియాస్ ఈశ్వర్ (42) మృతి చెందారు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ సోమవారం ఆయన కన్నుమూశారు. రూరల్ ఎస్ఐ ఎం. లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సైదులు ద్విచక్ర వాహనంపై మిర్యాలగూడ వైపు వెళుతుండగా, దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామానికి చెందిన బెజ్జం శ్రీనివాస్ నడుపుతున్న కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సైదులును స్థానికులు 108 అంబులెన్స్‌లో మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. మృతుడికి భార్య పుష్పలత, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

**ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాళి**

సైదులు మృతి విషయం తెలిసిన వెంటనే మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ సోమవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి విశేష సేవలు అందించిన కోట సైదులు అకాల మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. సైదులు కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దామరచర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నార్సింగిలో ఘోర రోడ్డు ప్రమాదం

**జెప్టో డెలివరీ బాయ్ మృతి**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన వాటర్ ట్రాక్టర్ ఢీకొనడంతో జెప్టో డెలివరీ బాయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గోల్కొండ ఖిలా నివాసి అయిన రహమత్ అన్సారీ (19) జెప్టో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం అతను తన ఎలక్ట్రిక్ బైక్ పై వస్తువులను డెలివరీ చేయడానికి వెళ్తుండగా, పుప్పాలగూడ పైప్‌లైన్ రోడ్డులోని హీరో షోరూమ్ సమీపంలో ఒక వాటర్ ట్రాక్టర్ అతని బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రహమత్‌ను స్థానికులు వెంటనే భూమి ఆసుపత్రికి తరలించారు. అయితే, అతడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సమాచారం అందుకున్న నర్సింగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## రాజేంద్రనగర్‌లో కల్తీ కల్లు కలకలం

**సమగ్ర విచారణకు ఫార్వర్డ్ బ్లాక్ డిమాండ్**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న కల్తీ కల్లు విక్రయాలపై ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సీనియర్ నాయకులు బండి నరసింహ డిమాండ్ చేశారు. కల్తీ కల్లు కారణంగా స్థానిక ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ కమాన్ సమీపంలోని బార్ పక్కన, అలాగే ఆంధ్రా బ్యాంక్ ఎదురుగా ఉన్న కల్లు కాంపౌండ్‌లలో పెద్ద ఎత్తున కల్తీ కల్లు విక్రయాలు సాగుతున్నాయి. ఈ కల్తీ మద్యం సేవించడం వల్ల గత రెండు నెలల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్ర అనారోగ్యం బారిన పడ్డారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో అక్కడికి వచ్చి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించాలని బండి నరసింహ కోరారు. ఎక్సైజ్, ఫుడ్ సేఫ్టీ, పోలీస్ శాఖలతో పాటు జిల్లా యంత్రాంగం సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టి, కల్లు నమూనాలను ల్యాబ్‌కు పంపి పరీక్షించాలని డిమాండ్ చేశారు. కల్తీ జరిగినట్లు తేలితే నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ విషయమై జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ కమిషనర్, పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## రైతుల భూముల కోసం బీఆర్ఎస్ పోరాటం ఉధృతం

**హైడ్రా చర్యలపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను నిలదీసిన ప్రదీప్ రెడ్డి**

**రైతులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం అని హామీ**



**గండిపేట : ( క్రైమ్ మిర్రర్ ):** శంషాబాద్ మండలం పరిధిలోని బహదూర్‌గూడ బ్రాహ్మణపల్లి వ్యవహారంలో రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేసింది. బీఆర్ఎస్ అధ్యక్షులు ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హైడ్రా ద్వారా భూములపై జరుగుతున్న చర్యలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సందర్భంగా ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నించారు. రైతుల పక్షాన నిలబడాల్సిన సమయంలో ముసలి కన్నీరు కారుస్తూ, గతంలో ఇచ్చిన హామీలను విస్మరించడం సరికాదని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డిలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. బీఆర్ఎస్ శ్రేణులను అవమానించే విధానాన్ని పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఎకరాకు 500 గజాలు లేదా 600 గజాలు ఇస్తామని చెప్పడం రైతులకు పరిష్కారం కాదు. ఇది ఎంతవరకు న్యాయమో ప్రభుత్వం సమాధానం చెప్పాలి" అని ప్రశ్నించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి వెంటే ఉంటుందని స్పష్టం చేశారు. రైతుల భూముల పరిరక్షణ కోసం హైకోర్టులో కేసు దాఖలు చేశామని, రైతుల పక్షాన అనుకూలంగా స్టే ఆర్డర్ వస్తుందనే నమ్మకం ఉందని తెలిపారు. రైతులకు ధైర్యం చెప్పేందుకు మీకు అండగా మేమున్నాం అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు పరమేశ్వరి, ప్రధాన కార్యదర్శి రాహుల్ గాజుల, బీసీ సెల్ అధ్యక్షులు అర్జున్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసింహ, లీగల్ సెల్ జైకృష్ణ, యువజన అధ్యక్షులు టిల్లు, ఉపాధ్యక్షులు గడ్డమీద యాదగిరి, హరి గౌడ్, మందాడి వేణుగౌడ్, యాదగిరి, శీను నాయక్ తదితరులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్ అమానుషం

## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి : సిపిఎం డిమాండ్





**క్రైమ్ మిర్రర్ , పాలకీడు :** నీట్ పరీక్ష లీకేజీ వ్యవహారంలో నిందితులను కఠినంగా శిక్షించాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని గత కొద్ది రోజులుగా ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న సామాజిక కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేసి దానిపై చలో పార్లమెంటు సందర్భంగా నిరసన వ్యక్తం చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ, వామపక్ష విద్యార్థి సంఘ నాయకుల పై పోలీసులు లాటి చార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్ పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మత విద్వేషాలు రెచ్చగొడుతూ విద్యార్థులతో చెలగాటమాడుతూ పరీక్ష పత్రాలు లీకైన వారిపై చర్యలు తీసుకోకుండా దానికి బాధ్యత ఉన్నటువంటి విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయకుండా ఉండటం అనైతికమని ఆయన అన్నారు ఇప్పటికైనా లీక్ వీరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రశ్నించే వారిని ఉద్యమించే వారిని లాఠీలతో తూటాలతో బెదిరించలేదని చరిత్ర చెబుతున్నదని ఇప్పటికైనా ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తోని రాజీనామా చేయించాలని పరీక్షా పత్రాల లీకేజీ కారుకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు .లేనియెడల ఈ ఉద్యమాన్ని దేశవ్యాప్త ఉద్యమంగా రూపుదిద్దుకుంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వారాహి మాత మాలధారణ స్వాములకు అన్నప్రసాద వితరణ

**క్రైమ్ మిర్రర్, నేరేడుచర్ల :** నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక శ్రీ విజయదుర్గ ఆలయంలో కొలువై ఉన్న శ్రీ వారాహి అమ్మవారి ఆలయంలో వారాహి మాత మాలధారణ స్వాములకు హుజూర్‌నగర్ జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ సరికొప్పుల నాగేశ్వర రావు ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా సరికొప్పుల నాగేశ్వర రావు ,14వ వార్డు కౌన్సిలర్ సరికొప్పుల విజయలక్ష్మి లు స్వయంగా స్వాములకు అన్నప్రసాదాన్ని వడ్డించి వారి ఆశీస్సులు పొందారు. వారాహి అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా వారాహి అమ్మ వారు అంటే చాలా ఇష్టం అని తెలియ చేశారు,భక్తులకు సేవ చేయడం ఎంతో పుణ్యకార్యమని, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వారాహి మాత మాలధారణ స్వాములు, భక్తులు,కొమ్మరాజు శ్రీను, అంజి, మహేష్, భాస్కర్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



మునుగోడు క్రైమ్ మిర్రర్: మునుగోడు మండలములోని 33/11 కేవీ సబ్-స్టేషన్‌లో నిర్వహణ పనులు ఉన్నందున మంగళవారం ఉదయం 8 గంటల 30 నిముషాల నుండి ఉ.11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది అని ఏఈ తెలిపారు.మునుగోడు టౌన్, గూడపూరు, కల్వలపల్లి, జమస్తాన్ పల్లి, పులిపలుపుల, రావిగూడెం, సొనబండ , గుండ్లోరిగూడెం మరియు సోలిపురం గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది , ప్రజలు సహకరించాలని కోరారు.

## గండిపేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మన్నే నరేందర్ ముదిరాజ్

### పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తా



**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** నార్సింగి సర్కిల్ గండిపేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తనను గుర్తించి బాధ్యతలు అప్పగించినందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు మన్నే నరేందర్ ముదిరాజ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ గౌరవప్రదమైన బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఈ పదవితో తనపై మరింత బాధ్యత పెరిగిందని, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం, పార్టీ సిద్ధాంతాల పరిరక్షణకు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల కోసం నిబద్ధతతో పనిచేస్తానని తెలిపారు. తన నియామకంపై అభినందనలు తెలిపిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఓటర్ల సవరణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం: బీఆర్ఎస్ నేత ప్రేమ్ గౌడ్

**ఎస్ఐఆర్ ప్రక్రియపై నిర్లక్ష్యం వహిస్తోంది.. ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉండాలి**



**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటర్ల సవరణ ప్రక్రియలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ప్రేమ్ గౌడ్ ఆరోపించారు. బండ్లగూడ కార్పొరేషన్, రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలు తమ ఓటు హక్కును కాపాడుకునేందుకు స్వయంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం విలేకరులతో మాట్లాడిన ప్రేమ్ గౌడ్.. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు సవరణ) ప్రక్రియ కొనసాగు తున్నప్పటికీ, ప్రభుత్వం దీనిని కేవలం మొక్కుబడిగా నిర్వహిస్తోందని విమర్శించారు.కాంగ్రెస్ పాలనలో ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ప్రజలకు సరైన అవగాహన కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏ), సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని అన్నారు.ప్రతి ఓటరు తన ఓటు హక్కును కాపాడుకోవాలి. అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలను సంప్రదించి ఎస్ఐఆర్ ఫారాలను తీసుకొని సకాలంలో పూర్తి చేసి సమర్పించాలి" అని ప్రేమ్ గౌడ్ సూచించారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత ముఖ్య మైనదని, నిర్లక్ష్యం కారణంగా ఏ ఒక్కరి ఓటు కూడా తొలగిపోకుండా ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.


## రావిర్యాల జెడ్ పి ఎచ్ ఎస్ ప్రభుత్వ పాఠశాలకు అరుదైన గౌరవం

రావిర్యాల పాఠశాలలో 10 వ తరగతి టాపర్ గోదాసు శ్రీనేత్రకు లక్ష రూపాయల బహుమతి...!

నియోజకవర్గంలో మొదటి స్థానం ,రంగారెడ్డి జిల్లాలో మూడవ స్థానంలో నిలిచిన శ్రీనేత్ర

శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ గ్రూప్ అఫ్ కంపెనీ ఆధ్వర్యంలో ఘన సత్కారం

శ్రీనేత్రను అభినందించిన ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం మండలం లోని రావిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025 --- 2026 వ సంవత్సరం పదవ తరగతిలో పాఠశాల టాపర్ గా నిలిచిన శ్రీనేత్ర ను శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ గ్రూప్ అఫ్ కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థి గోదాసు శ్రీ నేత్రతో పాటు వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించి లక్ష రూపాయలు నగదును అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలోనే మొదటిస్థానం,జిల్లాలో మూడవ స్థానం కైవసం చేసుకునే స్థాయికి తీసుకువచ్చిన రావిర్యాల పాఠశాల ఉపాధ్యకులకు ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి విద్యార్థులకు విద్యపై మరింత అవగాహన కల్పించి రాష్ట్రస్థాయిలో రాణించేల వారికి విద్యనుబోధించాలని కోరారు.లక్షలు పెట్టీ ప్రైవేటు పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల కన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులే మిన్న అన్నట్టుగా.. పాఠశాల పేరును రాష్ట్ర స్థాయిలో అందరు గుర్తించేలా చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాలతో పాటు విద్యార్థులు, రావిర్యాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ గ్రూప్ అఫ్ కంపెనీ యాజమాన్యం పాల్గొన్నారు.



## సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్లు పథకం ప్రారంభం

### పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్లు పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో ఎల్.ఐ.జి గృహ నిర్మాణ పథకాన్ని అధికారులు లాంఛనంగా ప్రారంభించారు. పేదల సొంతింటి కలను నెరవేర్చే ఈ బృహత్తర కార్యక్రమానికి రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి. ప్రకాష్ గౌడ్ హాజరయ్యారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్, మహమ్మద్ అజహరుద్దీన్ లతో కలిసి ఆయన ఈ ప్రతిష్టాత్మక ప్రారంభోత్సవంలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి. గౌతంతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌లో రూ. 90.20 లక్షలతో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల్లో భాగంగా సోమవారం రెండు ప్రధాన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఘనంగా శంకుస్థాపన జరిగింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మొత్తం రూ. 90.20 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులను చేపట్టారు. రాజేంద్రనగర్ డివిజన్ (వార్డ్ నెం. 120) పరిధిలోని న్యూ గ్రీన్ సిటీ కాలనీలో రూ. 67.80 లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అదే డివిజన్‌లోని బుద్వేల్ సిగ్నేచర్ అపార్ట్మెంట్ సమీపంలో రూ. 22.40 లక్షల వ్యయంతో మరో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ఈ అభివృద్ధి పనులకు అధికారికంగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నాణ్యత ప్రమాణాలు పాటించి... త్వరితగతిన పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**రూ. 19.50 కోట్లతో కోతులారం - కొంపల్లి ఆర్‌అండ్ బి రోడ్డు పనులకు శంకుస్థాపన**



**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** మునుగోడు మండలంలోని కోతులారం గ్రామం నుండి కొంపల్లి వరకు రూ. 19 కోట్ల 50 లక్షల వ్యయంతో నిర్మించనున్న 6.2 కిలోమీటర్ల ఆర్‌అండ్ బి రహదారి అభివృద్ధి పనులకు స్థానిక శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సోమవారం కోతులారంలో శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా గ్రామీణ రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్ బి శాఖ సంబంధిత అధికారులు, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు..



# సామాజిక అసమానతల సర్కారు బాయి



తెలంగాణ నేపథ్యంలో సామాజికాంశాల్ని చర్చిస్తూ తెరకెక్కిస్తున్న చిత్రం 'సర్కారు బాయి'. శ్రీరామ్ నిమ్మల, వర్షిక జంటగా నటిస్తున్నారు. లారా దర్శకుడు. తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి నిర్మాత. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఇటీవల ప్రముఖ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ 'చరిత్రలో మరుగున పడిపోయిన ఓ కథను తెలియజెప్పే ప్రయత్నం చేస్తున్నాం. 1985లో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా రూపొందిస్తున్న ఈ చిత్రంలో కులవివక్ష, సామాజిక అసమానతలు, అణగారిన వర్గాలపై అన్యాయాల గురించి చర్చించబోతున్నాం' అన్నారు. సమాజానికి సందేశాన్నందించే చిత్రమిదని నిర్మాత తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి పేర్కొన్నారు. బాహుబలి ప్రభాకర్, వివ రెడ్డి, నాగ మహేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: కె.శివా, దర్శకుడు: లారా.




## అదే పెద్ద చాలెంజ్!

ప్రస్తుతం పూజాహెగ్డే దక్షిణాది చిత్రసీమపైనే పూర్తిగా దృష్టిపెట్టింది. ముఖ్యంగా తెలుగులో పూర్వ వైభవం కోసం గట్టి ప్రయత్నాలే చేస్తున్నది. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఇండస్ట్రీ పరిస్థితులపై ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. ప్రస్తుతం థియేట్రికల్ సినిమా చాలా ఇబ్బందుల్లో ఉందని, విడుదలైన వెంటనే కంటెంట్ ఎలాంటిదో ప్రేక్షకులు ఓ నిర్ణయానికి వస్తున్నారని, ఫేక్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో వారిని మభ్యపెట్టడం సాధ్యం కాదని చెప్పింది. నేడు వినోదానికి అనేక వేదికలు అందుబాటులో ఉన్నాయని, ప్రేక్షకులు థియేటర్‌కు రావాలంటే కథలో బలమైన ఉద్వేగాలు ఉండాలని అభిప్రాయపడింది.తెలుగు వార్తలుకమర్షియల్ సినిమాల్లో నటించడం చాలా సులభమని అనుకుంటారని, కానీ వాటిలోనే ఎన్నో సవాళు ంటాయని పూజా హెగ్డే చెప్పింది. 'మంచి కథలో అభినయంపై దృష్టిపెడితే సరిపోతుంది. కానీ కమర్షియల్ సినిమా అలా కాదు. గ్లామర్‌తో పాటు డ్యాన్స్, ఎమోషన్స్..ఇలా అన్ని అంశాల్లో సమతుల్యం పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలి. అన్నింటికంటే కమర్షియల్ సినిమానే పెద్ద చాలెంజ్' అని పూజాహెగ్డే చెప్పింది. ప్రస్తుతం ఈ భామ తెలుగులో దుల్కర్ సల్మాన్ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది. శర్వానంద్ 'జార్జ్‌క్రిష్' చిత్రంలో కూడా ఆమెనే నాయికగా ఖరారయ్యే

# దసరా బరిలో కింగ్ 100? అగ్ర నటుడు నాగార్జున



అగ్ర నటుడు నాగార్జున ప్రస్తుతం తన వందో చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. రా.కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు 'కింగ్100' 'లాటరీ కింగ్' అనే టైటిల్స్ ప్రచారంలో ఉన్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నట్లు తెలిసింది. ఈ నెలాఖరులోగా షూటింగ్‌ను కంప్లీట్ చేసి పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలను మొదలుపెడతారని సమాచారం. ఓ సామాన్యుడు అసాధారణ శక్తిగా ఎదిగిన వైనాన్ని ఆవిష్కరించే కథాంశమిదని, ఇందులో నాగార్జున విభిన్న కాలాల్లో, డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తారని అంటున్నారు. ఏఐ సాంకేతికతతో నాగార్జున రెట్రోలుక్స్‌ని రీక్రియేట్ చేయబోతున్నారని తెలిసింది. ఆయన లుక్స్‌తో పాటు క్యారెక్టర్ ప్రజెంటేషన్ సరికొత్తగా ఉంటుందని చెబుతున్నారు. ఈ చిత్రాన్ని దసరా బరిలో దించేందుకు నాగార్జున సన్నాహాలు చేస్తున్నారట. టబు కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని నాగార్జున స్వీయ నిర్మాణంలో తెరకెక్కిస్తున్నారు.

## విడాకుల దిశగా శుభ పూంజా దంపతులు

కన్నడ సినీ రంగానికి చెందిన ప్రముఖ నటి, బిగ్‌బాస్ మాజీ పోటీదారు శుభ పూంజా వైవాహిక జీవితం ముగింపు దశకు చేరుకుంది. దంపతులు విడిపోవాలని నిర్ణయించుకున్నారు. నాలుగేళ్ల క్రితం నటి శుభ పూంజా, ఆమె భర్త సుమంత్ బిల్లవ పరస్పరం అంగీకరించుకొని విడాకులు కోరుతూ ఫ్యామిలీ కోర్టుకు వెళ్లారు. కన్నడ పర పోరాటదారుడు, వ్యాపారి ఉడుపికి చెందిన సుమంత్ బిల్లవ, నటి శుభ పూంజా ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. 2022 జనవరి 5న శుభ పూంజా తన సొంతూరులో సరళంగా దాంపత్య జీవితంలోకి అడుగు పెట్టారు. ఇద్దరి అంగీకారం మేరకు ఫ్యామిలీ కోర్టులో అర్జీ వేశారు. వచ్చే వాయిదా రోజున ఇద్దరు కోర్టుకు వెళ్లి జడ్జి ముందు హాజరై విడాకులు తీసుకోవాలని నిర్ణయించారు.





## కొత్త సినిమా సన్నాహాల్లో..

అగ్ర హీరో వెంకటేష్ ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో 'ఆదర్శకుటుంబం' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. దీని తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో కల్యాణ్‌రామ్‌తో కలిసి ఓ మల్టీస్టారర్ చిత్రాన్ని చేయబోతున్నారు. తాజా సమాచారం ప్రకారం ఆయన మరో చిత్రానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది. 'విశ్వంభర' దర్శకుడు వశిష్టతో ఓ చిత్రానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. స్టోరీ లైన్ నచ్చడంతో వెంకటేష్ ఈ సినిమాకు సూత్రప్రాయంగా అంగీకరించారని, ఫుల్ నరేషన్ అయిన తర్వాత సినిమాపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు. ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.

## ఆ వార్తల్లో నిజం లేదు!



కన్నడ అగ్ర హీరో యష్ నటించిన పాన్ ఇండియా గ్యాంగ్‌స్టర్ డ్రామా 'టాక్సిక్' రిలీజ్‌పై సందిగ్ధత నెలకొంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై భారీ హైప్‌ని క్రియేట్ చేశాయి. ఇది గ్యాంగ్‌స్టర్ డ్రామా అయినప్పటికీ.. మనోవిశ్లేషణతో కూడిన కథాంశమని, డార్క్ క్యారెక్టర్‌ను దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ పాజిటివ్‌గా ఆవిష్కరించారని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో యష్ తెలిపారు. దీంతో గ్యాంగ్‌స్టర్, సైకలాజికల్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారని తెలుస్తున్నది. తాజాగా ఈ సినిమాను రీషూట్ చేస్తున్నారని, ఫైనల్ అవుట్‌పుట్‌పై యష్ సంతృప్తిగా లేరని, అందుకే రిలీజ్ డేట్ పలుమార్లు వాయిదా పడిందని సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. వీటిపై చిత్రబృందం స్పందించింది. ఇవన్నీ పుకార్లని, నిర్మాణానంతర కార్యక్రమాలను పూర్తి చేసుకొని ప్రస్తుతం ప్రమోషనల్ ఈవెంట్స్‌పై దృష్టి పెట్టామని స్పష్టం చేసింది. ఈ సినిమాను ఇంగ్లీష్ భాషలో కూడా రిలీజ్ చేస్తుండటంతో హీరో యష్ విదేశీ ప్రచార కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. ఇప్పటికే పలుమార్లు విడుదల వాయిదా పడ్డ ఈ సినిమా ఆగస్టులో ప్రేక్షకుల ముందుకురానుందని సమాచారం. ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వాణీ, హ్యూమా ఖురేషి, రుక్మిణి వసంత్, తారా సుతారియా తదితరులు ప్రధాన పాత్రల్ని పోషించారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.